
ANN తెలుగు
Follow: @ANNTELUGU
08-08-2025
# మహా పత్రిక
శుక్రవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 245 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

# ఓట్ చోరీ
## ఇదే బీజేపీ గెలుపు మంత్ర

రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు.. ప్రూఫ్స్ ఇవేనంటూ పవర్ పాయింట్ ప్రజంటేషన్
మహారాష్ట్రలో అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల మధ్య కోటి ఓట్లు పుట్టుక
ఒకే ఓటర్.. వేర్వేరు రాష్ట్రాలు, వేర్వేరు బూత్‌లలో ఓట్లు.. కర్ణాటకలో ఒక్క లోక్ సభ స్థానంలోనే లక్షల ఓట్ల చోరీ
ఐదు పద్ధతుల్లో ఓట్లచోరీ జరుగుతుందంటూ వివరణ.. ఇండియా ట్రెండింగ్ గా మారిన ఓట్ చోరీ
మహారాష్ట్రలో జనాభా కంటే ఓట్లు ఎక్కువ.. ఇంటినెంబర్ సున్నాతో వందల ఓట్లు
మహారాష్ట్ర, బిహార్, కర్నాటక, హర్యానా లలో ప్రకంపనలు.. ఏపీలోనూ వైరల్
తప్పనితేలితే రాహుల్ కు శిక్ష తప్పదంటూ ఈసీ ట్వీట్


**ఢిల్లీ, మహా:** ఎన్నికల అవకతవకలపై బాంబు పేల్చుతానంటూ గత కొంతకాలంగా చెబుతున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గురువారం అన్నంతపనీ చేశారు. ఏకంగా ఆటం బాంబునే పేల్చారంటూ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరిగింది. ఢిల్లీలోని ఇందిరా భవన్ లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఓట్ల చోరీకి సంబంధించిన ఎవిడెన్స్ ను వెల్లడించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఓట్ల చోరీ జరిగిందని ఆరోపించారు. బీజేపీకోసం ఎన్నికల సంఘం ఓట్ల దొంగతనానికి పాల్పడిందని సంచలన ఆరోపణలు చేశారు. మహారాష్ట్ర, హర్యానా, కర్ణాటక రాష్ట్రాలలో ఓట్ల చోరీకి పాల్పడ్డారని ఆరోపించారు. కర్ణాటకలోని మహదేవ్ పుర అసెంబ్లీ నియోజకవర్గాన్ని శాంపుల్ గా తీసుకుని అక్కడ జరిగిన ఓట్ల చోరీకి సంబంధించిన డేటాను సేకరించినట్లు రాహుల్ తెలిపారు. డేటా వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాహుల్ గాంధీ వెల్లడించారు. ఒకే ఓటర్ పేరున.. ఒకే ఫోటో పేరున.. ఒకే వ్యక్తికి సంబంధించి వేర్వేరు బూత్ లలో.. వేర్వేరు రాష్ట్రాలలో నమోదైనట్లు ఆధారాలతో సహా రాహుల్ గాంధీ చూపించారు.




### 5 రకాలుగా ఓట్ల చోరీ

ఇటీవలి ఎన్నికల్లో మొత్తం ఐదు రకాలుగా ఓట్ల చోరీ జరిగిందని రాహుల్ ఆరోపించారు.

1. డూప్లికేట్ ఓటర్స్
2. తప్పుడు, చెల్లని అడ్రస్‌లు
3. ఒకే అడ్రస్‌లో బల్క్ ఓటర్స్
4. చెల్లని ఫోటోలు
5. ఫామ్ 6 నిరుపయోగం



### మూడు రాష్ట్రాల్లో ఓటేసిన ఆదిత్య శ్రీవాత్సవ

ఆదిత్య శ్రీ వాత్సవ అనే ఒకే వ్యక్తి మూడు రాష్ట్రాలలో ఓట్లేసినట్లు రాహుల్ ఆరోపించారు. ఉత్తరప్రదేశ్ మహారాష్ట్రలో ఒక్కోసారి ఓటేయగా.. కర్ణాటకలో రెండు సార్లు ఓటేసినట్లు చెప్పారు. అదే విధంగా గురు కిరాత్ సింగ్ అనే వ్యక్తి ఒకే నియోజకవర్గంలో 4 పోలింగ్ బూత్ లలో నాలుగు సార్లు ఓట్లేసినట్లు చెప్పారు. ఇలా వేల సంఖ్యలో ఓట్లు నమోదైనట్లు చెప్పారు. ఇది తాను సొంతంగా చెబుతున్న విషయం కాదని.. ఎన్నికల సంఘం ఇచ్చిన డేటా ఆధారంగానే నిరూపిస్తున్నట్లు చెప్పారు. ఇలాంటి ఓటర్లు మహదేవ్ పుర ఒక్క అసెంబ్లీలోనే 11 వేల 965 ఉన్నట్లు తెలిపారు. ఇలాంటి అవినీతి జరిగినందుకే ఎన్నికల కమిషన్ సీసీటీవీ ఫుటేజ్ ను ధ్వంసం చేసినట్లు ఆరోపించారు.

### షకున్ రాణి

కర్ణాటక మహదేవ్ పుర అసెంబ్లీలో 70 ఏళ్ల షకున్ రాణి.. పేరు మీద రెండు బూత్ లలో రెండు సార్లు ఓటేసినట్లు చెప్పారు. సీసీ టీవీ ఫూటేజ్ ఆధారంగా ఆమె రెండు సార్లు ఓటేసినట్లు నిర్ధారించినట్లు చెప్పారు. ఆమెకు రెండు ఓటర్ ఐడీలు ఉన్నట్లు గుర్తించారు. పేరులో చిన్న చిన్న మార్పులతో వేర్వేరు ఓటర్ కార్డులు క్రియేట్ అయినట్లు చెప్పారు. ఈమె రెండు బూత్ లలో ఓట్లేయగా.. రెండు ఓట్లు కౌంట్ అయినట్లు చెప్పారు. ఓట్ల చోరీకి ఇది నిదర్శనమని అన్నారు రాహుల్.

వివరాలు 2లో



# మోదీ చేతుల్లో బీసీ బిల్లు
## మా పోరాటం పూర్తి చేశాం..
### కాంగ్రెస్ చిత్తశుద్ధిని ఎవరూ శంకించలేరు

బీసీ రిజర్వేషన్‌లు 42 శాతం ఇవ్వాలన్నది మా కమిట్‌మెంట్
రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ రాకుండా మోదీ, షా అడ్డుకున్నారు
బీసీలపై ప్రేమ ఉంటే కేంద్రం వెంటనే బిల్లు ఆమోదించాలి
ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**ఢిల్లీ, మహా:** బీసీ బిల్లులకు, ఆర్డినెన్స్‌కు వెంటనే ఆమోదం తెలపాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లు కోసం పోరాడుతామని స్పష్టం చేశారు. గురువారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ బిల్లును రాష్ట్రపతి ఆమోదించేలా కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నామన్నారు. మిగతా 2లో

### బీసీ రిజర్వేషన్ల అమలుకు 3 మార్గాలు

1. బీసీ రిజర్వేషన్ల అమలుకు తమ వద్ద 3 మార్గాలు ఉన్నాయని రేవంత్ రెడ్డి వెల్లడించారు. 1. 50శాతం సీలింగ్‌పై గత ప్రభుత్వం తెచ్చిన చట్టాన్ని పక్కన పెట్టి జీవో ఇవ్వాలని అన్నారు. జీవో ఇస్తే ఎవరైనా న్యాయస్థానానికి వెళ్తే స్టే వస్తుందని, జీవో ఇచ్చి ఎన్నికలకు వెళ్లే మొదటి మార్గం సాధ్యం కాదని ఆయన వివరించారు.
2. ఇప్పుడే స్థానిక ఎన్నికలు పెట్టకుండా ఆపడం రెండో మార్గమని రేవంత్ చెప్పారు. స్థానిక ఎన్నికలు ఆపితే కేంద్రం నుంచి రావాల్సిన నిధులు ఆగుతాయన్నారు. కేంద్ర నిధులు రాకుంటే గ్రామాల్లో వ్యవస్థలు కుప్పకూలుతాయని వివరించారు.
3. మూడవ మార్గం పార్టీ పరంగా బీసీలకు 42శాతం సీట్లు ఇవ్వడమని రేవంత్ అన్నారు. బీసీలకు 42శాతం సీట్లపై ఇతర పార్టీలపైనా ఒత్తిడి తెస్తామని ఆయన వెల్లడించారు.

## కేసీఆర్‌ను ఓడించడమే పెద్ద శిక్ష

- నేనెందుకు జైల్లో వేస్తా.. అయినా ఫామ్ హౌస్‌కు జైలుకు తేడా లేదు
- వచ్చే లోక్ సభ ఎన్నికల్లో బీజేపీకి 150 సీట్ల కంటే ఎక్కువ రానివ్వం
- 2029లో ఎన్నికలు గెలిచి చూపిస్తాం.. కిషన్ రెడ్డి అడ్డుకుంటారా?
- దుప్పటి కప్పుకొని పడుకున్నా ప్రజలు రెండోసారి కాంగ్రెస్ గెలిపిస్తారు
- మీడియా చిట్ చాట్‌లో సీఎం రేవంత్ రెడ్డి కామెంట్స్

వివరాలు 2లో

## రెచ్చిపోయిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే

ప్రభుత్వ కార్యక్రమంలో కాంగ్రెస్ ఇన్ ఛార్జిపై దాడి
శ్యామ్ నాయక్ పై వాటర్ బాటిల్ విసిరేసిన ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవాలక్ష్మి
తన జోలికొస్తే ఉరికిచ్చి కొడతామంటూ తీవ్ర అసహనం
మండిపడ్డ కాంగ్రెస్ శ్రేణులు .. రాష్ట్రవ్యాప్తంగా చర్చ



**ఆదిలాబాద్ మహా :** బీఆర్ఎస్ పార్టీ, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మి సహనం కోల్పోయారు. కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లా జన్కపూర్ లో జరిగిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆమె కాంగ్రెస్ నేతలపై విరుచుకుపడ్డారు.. చేతికి ఏది దొరికితే మిగతా 2లో



## బండి ఎంట్రీతో మరో మలుపు 02
### ఫోన్ ట్యాపింగ్ కేసులో సంచలనాలు

నేడు సిట్ ముందుకు కేంద్రమంత్రి సంజయ్
ఫోన్ ట్యాప్ అంశాలపై నైపుణ్యం ఉన్న ఉన్నతాధికారులతో భేటీ
హైదరాబాద్ కు చేరుకున్న కేంద్ర అధికారులు
కేంద్ర మంత్రి విచారణతో సంచలనాలు.. జాతీయస్థాయిలో చర్చ



## ఇక నీ ఆటలు సాగవు

- ట్రంప్ కు భారత్ భారీ షాక్
- ఈ రేంజ్ లో భారత్ షాక్ ఇస్తుందని ఎవ్వరు ఊహించలేదు

03

## అందరి లెక్కలు సరిచేస్తాం



- ఐఎఎస్ , ఐపీఎస్ లు చిలకపలుకులు మాట్లాడుతున్నారు
- రేవంత్ కంటే ఎక్స్‌ట్రాలు చేసే వారందరి పేర్లు రాసి పెట్టుకున్నాం
- అధికారులపై మరోసారి మాజీ మంత్రి కేటీఆర్ అక్కసు

వివరాలు 2లో

### బీసీలకు వెన్నుపోటు పొడవడంలో
## తెలంగాణ రోల్ మోడల్

- ముస్లింలకు 10% రిజర్వేషన్లు తీసేస్తే.. బీసీల రిజర్వేషన్ బాధ్యత తీసుకుంటా
- మీ ప్రకారం రిజర్వేషన్లు కొనసాగితే ఒవైసీ కుటుంబానికే సీఎం పదవి ఇస్తారు
- రాష్ట్రపతిపై మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు సరికాదు
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

02






| బంగారం ధరలు | |
|---|---|
| 24 క్యారెట్ | 1,02,550 |
| 22 క్యారెట్ | 94,000 |
| సిల్వర్ (కేజీ) | 1,17,000 |


## వచ్చే వారం హ్యామ్ రోడ్లకు టెండర్లు

- మూడేళ్లలో నిర్మాణాలు పూర్తి చేస్తాం: మంత్రి కోమటిరెడ్డి
- ఎన్‌హెచ్ఏఐ, ఎంఓఆర్‌హెచ్, ప్రాజెక్టు పనులపై అధికారులతో రివ్యూ

02








# ఓట్ చోరీ

## ఇదే బీజేపీ గెలుపు మంత్ర

రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు.. ప్రూఫ్స్ ఇవేనంటూ పవర్ పాయింట్ ప్రజంటేషన్

మహారాష్ట్రలో అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల మధ్య కోటి ఓట్లు పుట్టుక

ఒకే ఓటర్.. వేర్వేరు రాష్ట్రాలు, వేర్వేరు బూత్‌లలో ఓట్లు..

కర్ణాటకలో ఒక్క లోక్ సభ స్థానంలోనే లక్షల ఓట్ల చోరీ

5 పద్ధతుల్లో ఓట్లచోరీ జరుగుతుందంటూ వివరణ.. ఇండియా ట్రెండింగ్ గా మారిన ఓట్ చోరీ

మహారాష్ట్రలో జనాభా కంటే ఓట్లు ఎక్కువ.. ఇంటినెంబర్ సున్నాతో వందల ఓట్లు

మహారాష్ట్ర, బిహార్, కర్నాటక, హర్యానా లలో ప్రకంపనలు.. ఏపీలోనూ వైరల్

తప్పనితేలితే రాహుల్ కు శిక్ష తప్పదంటూ ఈసీ ట్వీట్

**ఢిల్లీ, మహా:** ఎన్నికల అవకతవకలపై బాంబు పేల్చుతానంటూ గత కొంతకాలంగా చెబుతున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గురువారం అన్నంతపనీ చేశారు. ఏకంగా ఆటం బాంబునే పేల్చారంటూ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరిగింది. ఢిల్లీలోని ఇందిరా భవన్ లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఓట్ల చోరీకి సంబంధించిన ఎవిడెన్స్ ను వెల్లడించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఓట్ల చోరీ జరిగిందని ఆరోపించారు. బీజేపీకోసం ఎన్నికల సంఘం ఓట్ల దొంగతనానికి పాల్పడిందని సంచలన ఆరోపణలు చేశారు. మహారాష్ట్ర, హర్యానా, కర్ణాటక రాష్ట్రాలలో ఓట్ల చోరీకి పాల్పడ్డారని ఆరోపించారు. కర్ణాటకలోని మహదేవ్ పుర అసెంబ్లీ నియోజకవర్గాన్ని శాంపుల్ గా తీసుకుని అక్కడ జరిగిన ఓట్ల చోరీకి సంబంధించిన డేటాను సేకరించినట్లు రాహుల్ తెలిపారు. డేటా వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాహుల్ గాంధీ వెల్లడించారు. ఒకే ఓటర్ పేరున.. ఒకే ఫోటో పేరున.. ఒకే వ్యక్తికి సంబంధించి వేర్వేరు బూత్ లలో.. వేర్వేరు రాష్ట్రాలలో నమోదైనట్లు ఆధారాలతో సహా రాహుల్ గాంధీ చూపించారు.

**ఈవీఎంల పైనే అనుమానం**

ఈవీఎంలతో ఎన్నికల నిర్వహణపై రాహుల్అనుమానం వ్యక్తం చేశారు. అంచనాలకు అందని ఫలితాలు వస్తున్నాయని, బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ప్రభుత్వ వ్యతిరేకత ఉన్న చోట కూడా బీజేపీకి మాత్రమే అనుకూలంగా ఫలితాలు వస్తున్నాయని రాహుల్ డేటాతో సహా వివరించారు. బీహార్‌లో లక్షల మంది ఓట్లను తొలగించారని, బీహార్‌లో ఓట్ల తొలగింపుపై ఈసీ సమాధానం చెప్పాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఒపీనియన్ పోల్స్, ఎగ్జిట్ పోల్స్ ఒకలా ఉంటే.. ఫలితాలు ఇంకోలా ఉంటున్నాయని చెప్పారు. మహారాష్ట్రలో సాయంత్రం 5 గంటల తర్వాత అత్యధిక పోలింగ్ నమోదు కావడంపై ఆయన విస్మయం వ్యక్తం చేశారు. వాస్తవానికి సాయంత్రం 5 గంటల 30 నిమిషాల తర్వాత మహారాష్ట్ర పోలింగ్ బూత్‌ల్లో పెద్దగా క్యూలైన్లు లేకపోయినా భారీగా పోలింగ్ కావడం ఏంటని ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. భారీ పోలింగ్ ఎలా జరిగిందనేది అర్థం కాని అంశమని, రహస్యాలను ఈసీ ఎందుకు దాస్తోందని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల ఫలితాలను బీజేపీ ప్రభావితం చేస్తోందని.. మహారాష్ట్ర, హర్యానా ఫలితాలే ఇందుకు నిదర్శనం అని రాహుల్ ఆరోపించారు. జనాభా కంటే ఓటర్లు ఎక్కువగా ఉన్నారని, బీజేపీ కోసం ఈసీ ఓట్ల చోరీకి పాల్పడుతోందని కేంద్ర ఎన్నికల సంఘంపై రాహుల్ తీవ్ర ఆరోపణలు చేశారు. మహారాష్ట్రలో 5 నెలలకు ముందే భారీగా ఓటర్లు పెరిగారని, మహారాష్ట్ర అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల మధ్య కోటి మంది కొత్త ఓటర్లు వచ్చారని రాహుల్ ఆరోపించారు. కర్ణాటకలో జరిగిన ఎన్నికల్లోనూ అక్రమాలు జరిగాయని ఆరోపించారు. బెంగళూరు సెంట్రల్ లోక్ సభ నియోజకవర్గంలోని మహదేవపుర అసెంబ్లీ నియోజకవర్గంలో లక్షకు పైగా ఫేక్ ఓట్లు పోలయ్యాయని ఆరోపించారు. అందువల్లే బీజేపీ ఎంపీ పీసీ మోహన్ బెంగళూరు సెంట్రల్ స్థానం నుంచి ఎంపీగా గెలిచారని రాహుల్ ఆరోపణలు చేశారు. ఇంటి నెంబర్ 35, సింగిల్ బెడ్ రూం అపార్ట్ మెంట్ ఫ్లాట్.. ఈ అడ్రస్ లో 80 ఓట్లు నమోదు అయ్యాయి. ఇది పోలింగ్ బూత్ నెంబర్ 470 కిందకు వస్తుంది. ఓ సింగిల్ బెడ్ రూం ఇంట్లో 80 మంది ఎలా ఉంటారు.. ఇది సాధ్యమేనా అని ప్రశ్నించారు. అదే ఏరియా.. అదే మహదేవ్ పూర్. ఇంటి నెంబర్ 791. ఇది కూడా సింగిల్ బెడ్ రూం హౌస్. ఈ అడ్రస్ కింద 46 ఓట్లు నమోదు అయ్యి ఉన్నాయి. ఇది పోలింగ్ బూత్ నెంబర్ 366 పరిధిలోకి వస్తుంది. ఇవన్నీ దొంగ ఓట్లు అని.. ఆ ఇంటికి వెళ్లి మరీ విచారించాం అని.. ఇందుకు వీడియో సాక్ష్యంగా కూడా ఉందన్నారు. ఓటర్ల లిస్టులో నమోదైన ఓటర్లు అస్సలు ఎవరూ ఆ ఇళ్లల్లో ఉండటం లేదని.. అసలు వారు లోకల్ పీపుల్ కాదని విచారణలో తేలినట్లు రాహుల్ గాంధీ స్పష్టం చేశారు.

### ఒక్క నియోజకవర్గంలో లక్ష ఓట్లు చోరీ

బెంగళూర్ సెంట్రల్ లోక్ సభ స్థానంలో లోని మహదేవ్ పుర అసెంబ్లీ సెగ్మెంట్ లో మొత్తం ఒక లక్ష 250 ఓట్లు చోరీ అయినట్లు చెప్పారు. అయితే 40 వేల 9 అడ్రస్ లు ఇన్ వ్యాలిడ్ అడ్రస్ లు ఉన్నట్లు ఆరోపించారు. అదే విధంగా ఒకే అడ్రస్ పై బల్క్ ఓటర్లు 10 వేల 452 ఉన్నట్లు చెప్పారు. ఓటర్ లిస్టులో ఇన్వాలిడ్ ఫోటోస్ 4132 ఉన్నట్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వార చూపించారు. ఇక 33 వేల 692 సార్లు ఫార్మ్ 6 మిస్ యూస్ జరిగిందని తెలిపారు రాహుల్. సెంట్రల్ లోక్ సభలో మొత్తం ఓట్లలో కాంగ్రెస్ అభ్యర్థికి 6 లక్షల 26 వేల ఓట్లు నమోదవ్వగా.. బీజేపీ అభ్యర్థికి 6 లక్షల 58 వేల ఓట్లు పడ్డాయి. ఇందులో లక్ష ఓట్ల చోరీ జరిగిందని.. దీంతో బీజేపీ అభ్యర్థి గెలిచినట్లు చెప్పారు రాహుల్. కాంగ్రెస్ అభ్యర్థి మన్సూర్ అలీ ఖాన్ చాలా వరకు లీడ్ లో ఉన్నప్పటికీ.. ఫైనల్ గా మార్జిన్ 38 వేల 7 వందలతో బీజేపీ క్యాండిడేట్ గెలిచినట్లు చెప్పారు. చివరి 30 సెకండ్లలో ఫ్రాడ్ జరిగిందని మన్సూర్ ఆరోపించిన సంగతి గుర్తు చేశారు. మహదేవ్ పుర అసెంబ్లీ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థికి లక్ష 15 వేల 586 ఓట్లు రాగా.. బీజేపీ అభ్యర్థికి 2 లక్షల 29 వేలకు పైగా ఓట్లు వచ్చాయి. మార్జిన్ లక్షా 14 వేలుగా ఉంది. అయితే ఈ స్థానంలో మొత్తం 11 వేల 965 వేలకు పైగా ఫేక్ ఓట్లు ఉన్నట్లు తెలిపారు. మహదేవ్ పుర అసెంబ్లీ నియోజకవర్గం ఉన్న బెంగళూర్ సెంట్రల్ లోక్ సభలో లక్షా 250 ఓట్ల చోరీ జరిగిందని తెలిపారు..

# మోదీ చేతుల్లో బీసీ బిల్లు

మా పోరాటం పూర్తి చేశాం.. కాంగ్రెస్ చిత్తశుద్ధిని ఎవరూ శంకించలేరు

బీసీ రిజర్వేషన్‌లు 42 శాతం ఇవ్వాలన్నది మా కమిట్‌మెంట్

రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ రాకుండా మోదీ, షా అడ్డుకున్నారు

బీసీలపై ప్రేమ ఉంటే కేంద్రం వెంటనే బిల్లు ఆమోదించాలి

ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

42 శాతం రిజర్వేషన్ల అమలుకు ఉన్న మార్గాలన్నింటిని ప్రయత్నించామన్న రేవంత్ రెడ్డి కుదరనప్పుడు ప్రత్యామ్నాయ మార్గాల్లో స్థానిక ఎన్నికలకు వెళ్లాలన్నారు.

**కిషన్ రెడ్డికి అవగాహన లేదు..**

ఉద్యోగ రిజర్వేషన్లలో మాత్రమే ఏబీసీడీ వర్గీకరణ ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాజకీయ రిజర్వేషన్లలో ఉప వర్గీకరణ లేదని వెల్లడించారు. బీసీలందరికీ కలిపి 42 శాతం రిజర్వేషన్లు చేశామన్న ఆయన ఒక వర్గానికి ప్రత్యేకంగా రిజర్వేషన్లు లేవని వివరించారు. కిషన్‌రెడ్డి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ముందుగా చట్టం చదవాలి అని హితవు పలికారు.



రాజకీయంగా ఓబీసీ రిజర్వేషన్లలో వర్గీకరణ లేదని ఆయన తెలిపారు. బీసీఈ వర్గానికి ఇప్పటికే 4శాతం రిజర్వేషన్లు ఉన్నాయన్న రేవంత్ రెడ్డి కొత్తగా 10 శాతం రిజర్వేషన్లు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు.

# కేసీఆర్‌ను ఓడించడమే పెద్ద శిక్ష

నేనెందుకు జైల్లో వేస్తా.. అయినా ఫామ్ హౌస్‌కు జైలుకు తేడా లేదు

వచ్చే లోక్ సభ ఎన్నికల్లో బీజేపీకి 150 సీట్ల కంటే ఎక్కువ రానివ్వం

2029లో ఎన్నికలు గెలిచి చూపిస్తాం.. కిషన్ రెడ్డి అడ్డుకుంటారా?

దుప్పటి కప్పుకొని పడుకున్నా ప్రజలు రెండోసారి కాంగ్రెస్ గెలిపిస్తారు

మీడియా చిట్ చాట్‌లో సీఎం రేవంత్ రెడ్డి హాట్ కామెంట్స్

**ఢిల్లీ, మహా:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. బీసీ రిజర్వేషన్ల బిల్లుల ఆమోదానికి పార్లమెంట్‌లో ఒత్తిడి పెంచాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ నేతల బృందం ఢిల్లీలో పర్యటిస్తోంది. పర్యటనలో భాగంగా సీఎం రేవంత్ చిట్ చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం.. కేసీఆర్‌ను నేనెందుకు జైల్లో వేస్తా.. ఆయనే స్వీయ నియంత్రణగా జైల్లో ఉన్నట్లు ఫామ్ హౌస్‌లో ఉన్నారని వ్యాఖ్యానించారు. 'కేసీఆర్ ఫామ్ హౌస్‌కు.. చర్లపల్లి జైలుకు తేడా లేదు. ఫామ్ హౌస్‌లో పోలీసుల పర్యవేక్షణ ఉంటది. జైల్లో పోలీసుల పహారా ఉంటుంది. అప్పుడప్పుడు జైలుకు విజిటర్స్ వస్తుంటారు.. అలాగే ఫామ్ హౌస్‌కి విజిటర్స్ వెళ్లి వస్తున్నారు. కేసీఆర్‌ను ఓడించడమే పెద్ద శిక్ష. నేనెందుకు విద్వేష రాజకీయాలు చేస్తా. మేం దుప్పటి కప్పుకొని పడుకున్నా తెలంగాణ ప్రజలు రెండోసారి కాంగ్రెస్ గెలిపిస్తారు. బీహార్ ఎన్నికలతో పాటే జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వస్తుందని అనుకుంటున్నా. బీఆర్ఎస్ నేతలు కూడా నైతిక విజయం అంటే నైతికత కూడా ఆత్మహత్య చేసుకుంటుంది. బీఆర్ఎస్ నేతలకు నైతికత గురించి మాట్లాడే అర్హత లేదు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలన్నది మా విధానం. బీజేపీ నేతలు.. మీకు కావలసిన పద్ధతిలో చట్టం చేయండి. కిషన్ రెడ్డికి బీసీ బిల్లులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తాం. వచ్చే లోక్ సభ ఎన్నికల్లో బీజేపీకి 150 సీట్ల కంటే ఎక్కువ రానివ్వం. 2029లో ఎన్నికలు గెలిచి చూపిస్తాం..కిషన్ రెడ్డి అడ్డుకుంటారా?' అని అన్నారు.

# బండి ఎంట్రీతో మరో మలుపు

## ఫోన్ ట్యాపింగ్ కేసులో సంచలనాలు

నేడు సిట్ ముందుకు కేంద్రమంత్రి సంజయ్

ఫోన్ ట్యాప్ అంశాలపై నైపుణ్యం ఉన్న ఉన్నతాధికారులతో భేటీ

హైదరాబాద్ కు చేరుకున్న కేంద్ర అధికారులు

కేంద్ర మంత్రి విచారణతో సంచలనాలు.. జాతీయస్థాయిలో చర్చ



**హైదరాబాద్, మహా:** తెలుగు రాష్ట్రాల్లో పెను సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు బండి సంజయ్ ఎంట్రీతో మరో మలుపు తీసుకోనుంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటికే పలువురు నేతలను విచారించిన సిట్ వారి నుంచి వాంగ్మూలాలను సేకరించింది. ఇపుడు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను సిట్ విచారించనుంది. దిల్ కుష్ గెస్ట్ హౌజ్ లో ఆయన వాంగ్మూలాన్ని సిట్ రికార్డు చేయనుంది. ఈ నేపథ్యంలో ఫోన్ ట్యాపింగ్ విచారణపై గురువారం కేంద్ర హోం శాఖ అధికారులు ఆయనతో భేటీ అయ్యారు. కేంద్ర హోం శాఖ అధికారులు.. ఫోన్ ట్యాపింగ్ విచారణపై ఆయనతో చర్చించారు.

**పక్కా ఆధారాలతో విచారణకు..**

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఉండటంతో బండి సంజయ్ తన ఫోన్ ను ట్యాప్ చేసిన అంశంపై పూర్తి అధారాలను బయటకు తీసుకువచ్చారు. కేంద్ర హోంశాఖ అధికారుల్లో ట్యాపింగ్ అంశాలపై నైపుణ్యం ఉన్న వారిని హైదరాబాద్‌కు పిలిపించారు. వారితో పాటు ఉమ్మడి ఏపీ, తెలంగాణకు చెందిన పలువురు పోలీసు ఉన్నతాధికారుల్ని సైతం పిలిచి సమావేశం ఏర్పాటు చేశారు. ఎస్ఐబీ, సిట్, కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగాల్లో పనిచేసిన అధికారులతో తన ఫోన్ ట్యాప్ చేసిన వైనంపై చర్చించారు. కేసీఆర్ ప్రభుత్వం బండి సంజయ్ ఫోన్‌ను అత్యధికంగా ట్యాప్ చేసినట్లు నిర్ధారించిన పోలీసులు కొన్ని ఆధారాలనూ సేకరించారు.

**బండి సంజయ్ షెడ్యూల్ :**

శుక్రవారం ఉదయం 10 గంటలకు బంజారాహిల్స్‌లోని తన నివాసం నుండి బయలుదేరి నేరుగా 10.30 గంటలకు ఖైరతాబాద్ చౌరస్తా వద్దనున్న హనుమాన్ టెంపుల్‌ను దర్శించుకుంటారు. అనంతరం ఉదయం 11 గంటలకు అక్కడి నుండి రాజ్ భవన్ సమీపంలోని దిల్ కుశ్ గెస్ట్ హౌజ్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం 12 గంటలకు సిట్ విచారణకు హాజరవుతారు. సిట్ విచారణ అనంతరం మీడియాతో మాట్లాడతారు.

**కేసు విచారణ మరింత వేగవంతమయ్యే..**

ఫోన్ ట్యాపింగ్ టెక్నికల్ ఎవిడెన్స్‌ను బండి సంజయ్‌కు ఇచ్చారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సిట్ ఎదుట హాజరవుతున్న తొలి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌నే. తనతో పాటు తన కుటుంబ సభ్యుల ఫోన్లను ట్యాప్ చేశారని చాలా సార్లు ఆరోపించారు. ఇక అటు కాంగ్రెస్, ఇటు బీజేపీ రెండూ ఫోన్ ట్యాపింగ్ కేసులో బాధితులమే అని చెబుతుండటంతో.. కేసు విచారణ మరింత వేగవంతమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇదే సమయంలో ఈ వ్యవహారంపై మరింతగా పొలిటికల్ ఫైట్ జరిగే అవకాశం లేకపోలేదనే వాదన కూడా వినిపిస్తోంది. కేసులో వాస్తవాలు బయటకు రావాలంటే సీబీఐకు అప్పగించాలని డిమాండ్ చేస్తున్న బీజేపీ.. కాంగ్రెస్ అలా చేయకపోతే బీఆర్ఎస్‌తో కుమ్మక్కైనట్టే అని ఆరోపిస్తోంది. దీంతో కాళేశ్వరం కేసు తరహాలోనే ఫోన్ ట్యాపింగ్ కేసు కూడా మరింతంగా రాజకీయ రంగు పులుముకోవచ్చనే చర్చ జరుగుతోంది.

# రెచ్చిపోయిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే



(మొదటిపేజీ తరువాయి)

వాటిని విసిరేశారు. టేబుల్ పై ఉన్న వాటర్ బాటిళ్లను కాంగ్రెస్ పార్టీ ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి శ్యామ్ నాయక్ పై విసిరేసారు. దాడికి పాల్పడ్డారు. ఒక్కసారిగా ఆమె ప్రవర్తనతో అధికారులు, ప్రజలు అందరూ షాక్ అయ్యారు. పూర్తి వివరాల్లోకి వెళితే ..కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లా జన్కపూర్ లో గురువారం జరిగిన రేషన్ కార్డు పత్రాల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే కోవా లక్ష్మి హాజరయ్యారు.కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ప్రసంగంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ పథకాల గురించి ప్రస్తావించగా అక్కడే ఉన్న కాంగ్రెస్ అసెంబ్లీ ఇంచార్జి శ్యాం నాయక్ అభ్యంతరం వ్యక్తం చేసారు. ఇది ప్రస్తుత ప్రభుత్వ అధికారిక కార్యక్రమమని గత ప్రభుత్వ పాలన గురించి మాట్లాడవద్దని అనడంతో ఇద్దరి మధ్య మాటల తూటాలు పేలాయి.వాగ్వివాదం తారాస్థాయికి చేరడంతో కోవలక్ష్మి కోపంతో ఊగిపోతూ శ్యాం నాయక్ పై వాటర్ బాటిల్‌ను విసిరేసింది. అసహనంతో దాడికి పాల్పడింది. ప్రోటోకాల్ లేని వ్యక్తి చిల్లర రాజకీయాలు చేస్తున్నారని శ్యామ్ పై నోరు పారేసుకుంది. ఎమ్మెల్యే తీరు పట్ల కాంగ్రెస్ శ్రేణులు ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఒక ప్రజా ప్రతినిధికి ఇంత అసహనమైతే ఎలా అంటూ చర్చించుకుంటున్నారు. ఘటన పట్ల కాంగ్రెస్ నేతలు ఎమ్మెల్యే డౌన్ డౌన్ అంటూ నినాదాలతో నిరసన వ్యక్తం చేశారు.మొత్తం మీద ఈ ఘటన మాత్రం స్థానికంగా సంచలనం సృష్టించింది. కార్యక్రమం అనంతరం బయట ఆమె శ్యామ్ నాయక్ పై వాడు వీడు అంటూ మాటల దాడి చేసారు. దొంగ నాకొడుకు వలస నా కొడుకు అంటూ ఘాటైన తిట్ల దండకం అందుకున్నారు. నాన్ లోకల్ వాడైన శ్యామ్ తన నియోజక వర్గంలో కొచ్చి తననే ప్రశ్నిస్తాడా అంటూ మండి పడ్డారు. అతను జీవితంలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కాలేడని వ్యాఖ్యానించారు. మరోమారు తన జోలికొస్తే ఉరికిచ్చి కొడతామని హెచ్చరించారు.

## బీసీలకు వెన్నుపోటు పొడవడంలో
# తెలంగాణ రోల్ మోడల్

- ముస్లింలకు 10% రిజర్వేషన్లు తీసేస్తే.. బీసీల రిజర్వేషన్ బాధ్యత తీసుకుంటా
- మీ ప్రకారం రిజర్వేషన్లు కొనసాగితే ఒవైసీ కుటుంబానికే సీఎం పదవి ఇస్తారు
- రాష్ట్రపతిపై మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు సరికాదు
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

**ఢిల్లీ, మహా:** సీఎం రేవంత్ రెడ్డికి పాలన చేతకావడం లేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శలు చేశారు. తమ ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చేందుకే కాంగ్రెస్ నేతలు ధర్నాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఢిల్లీలో ప్రదక్షిణలు తప్పా.. రేవంత్ ప్రజలకు చేసిందేమీ లేదని ఆక్షేపించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీపై విమర్శలు, కాంగ్రెస్‌పై ప్రశంసలు తప్ప రేవంత్‌రెడ్డి ఏం చేశారని ప్రశ్నల వర్షం కురిపించారు. గురువారం ఢిల్లీ వేదికగా కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఒవైసీ కుటుంబానికే ముఖ్యమంత్రి పదవి ఇస్తారు.. ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్లు తీసేస్తే.. బీసీల రిజర్వేషన్ల బాధ్యత తానే తీసుకుంటానని అన్నారాయన. 'రేవంత్ తన స్థాయికి మించి మాట్లాడుతున్నారు. ప్రధానమంత్రిని లీగల్లీ కన్వర్టెడ్ బీసీ అంటారా? రేపు లంబాడాలను కన్వర్టెడ్ ఎస్టీ అంటారా?. అసలు ఆయనే కన్వర్టెడ్ కాంగ్రెస్. మజ్లిస్ కనుసన్నల్లో కాంగ్రెస్ పని చేస్తోంది. ఇదిలాగే కొనసాగితే ఒవైసీ కుటుంబానికే ముఖ్యమంత్రి పదవి ఇస్తారు. వచ్చే ఎన్నికల్లో రేవంత్ ఓటమి ఖాయం. గతంలోనే ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లను తెలంగాణ హైకోర్ట్ కొట్టేసింది. మజ్లిస్ కనుసైగలతో కేసీఆర్ ముస్లింలకు రిజర్వేషన్లు ఇచ్చారు. బీసీలకు 34 శాతం నుంచి 27 శాతం రిజర్వేషన్ తగ్గించారాయన. అలాంటప్పుడు ఇప్పుడెలా 10 శాతం రిజర్వేషన్లు ఇస్తారు.

**ఇది బీసీలను మోసం చేయడమే..**

మత రిజర్వేషన్లతో దేశంలో అల్లకల్లోలం జరుగు



తుంది. అసలు ముస్లింలకు బీసీ రిజర్వేషన్లు ఎలా ఇస్తారు?. ముస్లింలకు పది శాతం రిజర్వేషన్లు తీసేస్తే.. బీసీల రిజర్వేషన్ బాధ్యత నేనే తీసుకుంటా. రాష్ట్రపతి, ప్రధానితో కూడా మాట్లాడతా అని కిషన్ రెడ్డి అన్నారు. బీసీలకు వెన్నుపోటు పొడవడంలో తెలంగాణ రోల్ మోడల్. బీసీలను మోసం చేయడంలో, అక్రమాలు చేయడంలో మేము నిరక్షరాస్యులం. కేసీఆర్ వల్ల జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీసీ సీట్లలో నాన్ బీసీలు మాత్రమే గెలిచారు. కాంగ్రెస్ తెచ్చిన బిల్లుతో బీసీలకు కేవలం 32 శాతం రిజర్వేషన్లు దక్కుతాయి. ఇది బీసీలను మోసం చేయడమే. రాజ్యాంగ సమస్యల వల్లే గవర్నర్ రాష్ట్రపతికి బీసీ బిల్లు పంపారు అని కిషన్ రెడ్డి అన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముపై తెలంగాణ మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ.. 'రాష్ట్రపతిపై తెలంగాణ మంత్రి వ్యాఖ్యలు సిగ్గు చేటు. దీనిపై సోనియాగాంధీ వెంటనే క్షమాపణలు చెప్పాలి' అని డిమాండ్ చేశారు.

# వచ్చే వారం హ్యామ్ రోడ్లకు టెండర్లు

మూడేళ్లలో నిర్మాణాలు పూర్తి చేస్తాం: మంత్రి కోమటిరెడ్డి

ఎన్‌హెచ్ఏఐ, ఎంఓఆర్‌హెచ్, ప్రాజెక్టు పనులపై అధికారులతో రివ్యూ

**హైదరాబాద్, మహా:** వచ్చే వారంలో హ్యామ్ రోడ్ల నిర్మాణాలకు టెండర్లు పిలువనున్నట్లు మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించారు. మొదలు పెట్టిన అన్ని రోడ్ల నిర్మాణాలను వచ్చే మూడేళ్లలో పూర్తి చేయాలన్న లక్ష్యం పెట్టుకున్నట్లు వివరించారు. తన శాఖ తప్పా వేరే పని లేదని, అందుకే పనులన్ని స్పీడ్ చేస్తున్నామని స్పష్టం చేశారు. గురువారం సచివాలయంలో టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎన్‌హెచ్ఏఐ, ఎంఓఆర్‌హెచ్, ప్రాజెక్టులకు సంబంధించి పనుల పురోగతిపై చర్చించారు. విద్యుత్ లైన్ షిఫ్టింగ్, వాటర్ యుటిలిటీ క్లియరెన్స్, ఫారెస్ట్ క్లియరెన్స్ సంబంధిత అంశాలపై మంత్రి సమీక్షించారు. ఈ సమావేశంలో రాష్ట్ర స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, సీసీఎల్ఏ కమిషనర్ లోకేష్, విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, నీటిపారుదల, పంచాయతీ రాజ్, అటవీ శాఖ, మైనింగ్ శాఖల అధికారులు, ఎన్‌హెచ్ఏఐ, ఎంఓఆర్‌హెచ్, రీజినల్ ఆఫీసర్స్, రైల్వే అధికారులు పాల్గొన్నారు.



# అందరి లెక్కలు సరిచేస్తాం

- ఐఎఎస్ , ఐపీఎస్ లు చిలకపలుకులు మాట్లాడుతున్నారు
- రేవంత్ కంటే ఎక్స్‌ట్రాలు చేసే వారందరి పేర్లు రాసి పెట్టుకున్నాం
- అధికారులపై మరోసారి మాజీ మంత్రి కేటీఆర్ అక్కసు

**హైదరాబాద్, మహా:** బీసీల రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేస్తున్నది అని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో పరిగి నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. 42% రిజర్వేషన్లు ఇచ్చి రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పి ఓట్లు వేయించుకున్నది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. ఇప్పుడు మాత్రం రేవంత్ రెడ్డి రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయినాక బీసీ రిజర్వేషన్ల ఇస్తామని చెప్తున్నాడు కదా గుర్తు చేశారు. మరి బీసీ డిక్లరేషన్‌లో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయినాక బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఏమైనా చెప్పిందా అని ప్రశ్నించారు. గతంలో ఢిల్లీకి వెళ్లి తెలంగాణ ఏర్పాటుతోనే తిరిగి వస్తానని కేసీఆర్ ప్రకటించి తెలంగాణ సాధించుకుని తెచ్చిండు అని చెప్పారు. మరి రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లి బీసీల రిజర్వేషన్ సాధించిండా లేదా అనేది చెప్పాలి అని డిమాండ్ చేశారు.

**అన్ని లెక్కలు సెటిల్ చేసే బాధ్యత నాదే**

రాష్ట్ర వ్యాప్తంగా ఉండే కలెక్టర్లు, పోలీసు అధికారులకు ఒక్కటే చెబుతున్నా. పచ్చి అబద్ధాలు ఆడుతున్నారు. ఖైరతాబాద్‌లో మొన్న రేషన్ కార్డుల పంపిణీ సందర్భంగా ఐఏఎస్, ఐపీఎస్ కలిసి చిలుక పలుకులు మాట్లాడుతున్నారు. కాంగ్రెసోళ్లు మాట్లాడినట్లు మాట్లాడుతున్నారు. ఎక్కువ సమయం లేదు. మరో రెండున్నరేండ్లలో మళ్లీ మేమే వస్తాం. ఎవరైతే ఎగిరెగిరి పడుతున్నారో.. రేవంత్ రెడ్డి కంటే ఎక్స్‌ట్రాలు చేసే వారందరి పేర్లు బరాబర్ రాసి పెట్టుకుంటాం. ప్రతి ఒక్కరి మాటలు యాది పెట్టుకుంటాం. అన్ని లెక్కలు సెటిల్ చేసే బాధ్యత నాది అని' కేటీఆర్ చెప్పారు.

# ఇక నీ ఆటలు సాగవు

## ట్రంప్ కు భారత్ భారీ షాక్

### ఈ రేంజ్ లో భారత్ షాక్ ఇస్తుందని ఎవ్వరు ఊహించలేదు



**ఇంటర్నెట్ డెస్క్, మహా :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారతదేశంపై 50 శాతం సుంకాలు విధిస్తానని బెదిరించిన నేపథ్యంలో భారత్ ఒక కీలక నిర్ణయం తీసుకుని ట్రంప్‌కు గట్టి షాక్ ఇచ్చింది. రష్యా నుండి చమురు దిగుమతులు చేసుకుంటున్నందుకుగానూ భారత్ పై ట్రంప్ ఈ బెదిరింపులకు దిగారు. అయితే ఇదే సమయంలో అమెరికా, యూరోపియన్ దేశాలు కూడా రష్యా నుండి చమురు, గ్యాస్, ఎరువులను పెద్ద మొత్తంలో కొనుగోలు చేస్తుండటాన్ని భారత్ చాలాసార్లు ఎత్తి చూపింది. ఈ ద్వంద్వ వైఖరికి లొంగకుండా భారత్, అమెరికాకు చెందిన బోయింగ్ కంపెనీతో చేసుకున్న 31,500 కోట్ల రూపాయల విలువైన రక్షణ ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేసింది. ఈ చర్య ట్రంప్ బెదిరింపులకు భారత్ ఇచ్చిన బలమైన జవాబని స్పష్టమవుతోంది.

భారత నౌకాదళం కోసం ఆరు పీ8 ఐ పోసిడాన్ నిఘా విమానాలను కొనుగోలు చేయడానికి బోయింగ్ కంపెనీతో ఈ ఒప్పందం జరిగింది. ఈ విమానాలు హిందూ మహాసముద్రంలో చైనా కార్యకలాపాలను పర్యవేక్షించడంలో చాలా కీలకమైనవి. మొదట ఈ డీల్ విలువ 21,000 కోట్లుగా అంచనా వేసినప్పటికీ, జులై 2025 నాటికి అది 31,500 కోట్లకు పెరిగింది. అధిక వ్యయం ఉన్నప్పటికీ, నౌకాదళం ఈ డీల్‌ను ముందుకు తీసుకెళ్లాలని భావించింది. కానీ ట్రంప్ సుంకాల ప్రకటన ఈ డీల్‌ను రద్దు చేయడానికి దారి తీసింది. ఈ నిర్ణయం బోయింగ్ కంపెనీకి ఆర్థికంగా భారీ నష్టాన్ని కలిగించనుంది, అంతేకాకుండా భారత్‌లో ఆ సంస్థ వ్యాపారంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుంది. బోయింగ్ భారత్‌లో సుమారు 5 వేల మందికి ఉపాధి కల్పిస్తున్నందున ఈ నిర్ణయం గణనీయమైన పరిణామాలకు దారితీయవచ్చు.

ఈ డీల్ రద్దు వల్ల భారత నౌకాదళ సామర్థ్యంపై కొంత ప్రభావం పడవచ్చు. అయితే భారత్ దేశీయంగా నిఘా విమానాలను అభివృద్ధి చేయడానికి డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్ డీవో), హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) వంటి సంస్థలతో కలిసి పని చేస్తోంది. అందువల్ల, ప్రభుత్వం ఇప్పుడు స్వదేశీ విమానాలకే ప్రాధాన్యత ఇవ్వవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ చర్య ద్వారా భారత్ తన జాతీయ ప్రయోజనాల కోసం దృఢమైన నిర్ణయాలు తీసుకోవడానికి వెనుకాడదని అమెరికాకు స్పష్టమైన సంకేతాలు పంపింది. ఈ సంఘటన భవిష్యత్తులో అమెరికాభారత్ సంబంధాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందో, మరియు భారత్ తన రక్షణ అవసరాలను ఎలా తీర్చుకుంటుందో వేచి చూడాలి.

# తెలంగాణ విద్య రంగానికి సేవలు అందిస్తాం

- సీఎం రేవంత్ తో అమిటి యూనివర్సిటీ ఛాన్సలర్ అతుల్ చౌహాన్
- స్కిల్ డెవలప్‌మెంట్‌లో భాగస్వాములవుతామని వెల్లడి...
- యూనివర్సిటీకి ఆమోదం తెలపడంపై కృతజ్ఞతలు



**న్యూఢిల్లీ, మహా :** తెలంగాణ విద్యా రంగం అభివృద్ధికి తమ వంతుగా సేవలు అందిస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి అమిటీ యూనివర్సిటీ ఛాన్సలర్ అతుల్ చౌహాన్ తెలిపారు. ఢిల్లీలోని సీఎం అధికారిక నివాసంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని అమిటీ యూనివర్సిటీ ఛాన్సలర్ అతుల్ చౌహాన్ గురువారం కలిశారు. తెలంగాణలో తమ యూనివర్సిటీ ఏర్పాటుకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోద ముద్ర వేసినందుకు ముఖ్యమంత్రికి ఛాన్సలర్ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీతో తాము ఒప్పందం చేసుకుంటామని, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాల్లో భాగస్వాములవుతామని చౌహాన్ సీఎంకు తెలియజేశారు. మెరుగైన వసతులు, నాణ్యమైన విద్యా బోధనతో ఇప్పటికే అమిటీకి మంచి పేరు ఉందని, తెలంగాణలో మరింతగా రాణించేందుకు కృషి చేస్తామని సీఎంకు చౌహాన్ తెలిపారు. కార్యక్రమంలో అమిటీ యూనివర్సిటీ ప్రతినిధి రామచంద్రం పాల్గొన్నారు.



# గ్రీన్ ఎనర్జీ కారిడార్‌కు అనుమతి ఇవ్వండి

## కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి మనోహర్ లాల్ కట్టర్ ను కోరిన డిప్యూటీ సీఎం భట్టి

**న్యూఢిల్లీ, మహా :** టీఈఎస్‌ట్రాన్స్‌కో సంస్థ గ్రీన్ ఎనర్జీ కారిడార్ – దశ 3 కింద సమర్పించిన రాష్ట్రాంతర విద్యుత్ ప్రసరణ వ్యవస్థ ప్రతిపాదనలకు సంబంధించి అనుమతులు ఇవ్వాలని కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి మనోహర్ లాల్ కట్టర్ ను గురువారం ఢిల్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు కలిసి విజ్ఞప్తి చేశారు. గ్రీన్ ఎనర్జీ కారిడార్ (జీఈసీIII) దశలో సౌర విద్యుత్ సంస్థ (ఎస్ఈసీఐ) మొదట తెలంగాణ రాష్ట్రంలోని ఐదు జిల్లాలలో మొత్తం 13.5 గిగావాట్ల సామర్థ్యం గ్రీన్ పవర్ జోన్‌లను గుర్తించింది. వీటి ద్వారా విండ్, సోలార్ మరియు పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను ఎగుమతి చేయాల్సి ఉంటుందని కేంద్ర మంత్రికి డిప్యూటీ సీఎం తెలిపారు. తరువాత, ఎస్ఈసీఐ, టీజీ రెడ్ కోలతో విస్తృతంగా చర్చించిన అనంతరం, భూమి లభ్యత మరియు పునర్వినియోగ విద్యుత్ సాధ్యతలను పరిగణనలోకి తీసుకొని, ఈ ఆర్ఈ జోన్‌ల సామర్థ్యం 19 గిగావాట్లకు పెంచినట్లు వివరించారు. ఇది రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాలను కవర్ చేస్తోంది. ఈ సవరణకు అనుగుణంగా, టీజీ ట్రాన్స్ కో మొత్తం 19 గిగావాట్ల విద్యుత్ సామర్థ్యం కలిగిన 8 ట్రాన్స్‌మిషన్ పథకాలతో కూడిన సమగ్ర ప్రతిపాదనను తయారు చేసి, దాని అంచనా వ్యయం రూ. 6,895 కోట్లుగా పేర్కొంటూ కేంద్ర విద్యుత్ ప్రాధికార సంస్థ (సీఈఏ)కు సమర్పించిందని తెలిపారు. ఈ నేపథ్యంలో టీజీ ట్రాన్స్ కో సంస్థ సమర్పించిన ఈ 8 పథకాల (జిల్లాల) ద్వారా 19 గిగావాట్ల విద్యుత్ నికాసానికి సంబంధించిన ప్రతిపాదనను వీలైనంత త్వరగా ఆమోదించాల్సిందిగా కోరారు. ఇది రాష్ట్రంలో గ్రీన్ పవర్ అభివృద్ధిని, గ్రిడ్ ఇంటిగ్రేషన్ కార్యక్రమాలను వేగవంతం చేయడంలో సహాయ పడుతుందనీ డిప్యూటీ సీఎం వివరించారు.

# వర్షాలతో జంట జలాశయాలకు జలకళ

## క్రమంగా చేరుతున్న వరద నీరు

### హిమాయత్ సాగర్ రిజర్వాయర్ ఒక గేట్ అడుగు మేర ఎత్తివేత
### మూసీ నదిలోకి 339 క్యూసెక్కుల వరద నీరు విడుదల
### అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎండీ అశోక్ రెడ్డి సూచన

**హైదరాబాద్, మహా:** కొన్ని రోజులుగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో జంట జలాశయాలైన హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ కు వరద నీరు వస్తోంది. దీంతో హిమాయత్ సాగర్ రిజర్వాయర్ ఒక గేట్ ను నేడు (గురువారం) రాత్రి 10 గంటలకు జలమండలి అధికారులు ఎత్తారు. రిజర్వాయర్ ఒక్క గేటును ఒక ఫీటు మేర ఎత్తి వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం హిమాయత్ సాగర్ కు 1000 క్యూసెక్కుల ఇన్ ఫ్లో రాగా.. 339 క్యూసెక్కుల అవుట్ ఫ్లో ఉంది. జలాశయాల గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేసినందున ఎండీ అశోక్ రెడ్డి సంబంధిత జలమండలి అధికారులతో పాటు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిపాలనా యంత్రాంగాలు, హైడ్రా, జీహెచ్ఎంసీ, పోలీసు అధికారులతో సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు.

**హిమాయత్ సాగర్ రిజర్వాయర్ వివరాలు:**

**పూర్తి స్థాయి నీటి మట్టం : 1763.50 అడుగులు**
**ప్రస్తుత నీటి స్థాయి : 1762.70 అడుగులు**
**రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం : 2.970 టీఎంసీలు**
**ప్రస్తుత సామర్థ్యం : 2.734 టీఎంసీలు**
**ఇన్ ఫ్లో : 1000 క్యూసెక్కులు**
**అవుట్ ఫ్లో : 339 క్యూసెక్కులు**
**మొత్తం గేట్ల సంఖ్య : 17**
**ఎత్తిన గేట్ల సంఖ్య : 01**

# నా ఓటమికి కారణం ఆ ఎపిసోడే...

- ఫామ్ హౌజ్ కొనుగోలు అంశంపై.. కుండబద్దలు కొట్టిన గువ్వల బాలరాజు
- కేసీఆర్ చెప్పింది తూచ తప్పకుండా చేశా

**అచ్చంపేట, మహా:** అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు మరోసారి సంచలనవ్యాఖ్యలు చేశారు. ఫామ్ హౌజ్ ఎపిసోడే తన ఓటమికి కారణమని కుండబద్దలు కొట్టారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'అచ్చంపేట ప్రజలు నన్ను రెండుసార్లు ఆశీర్వదించారు. బీఆర్ఎస్‌లో నా ఆశయాలకు అనుకున్న స్థాయిలో గౌరవం దక్కలేదు. కేసీఆర్ అధికారం కోల్పోయాక ఇంటినుంచే ఆదేశాలిచ్చారు. ప్రభుత్వాన్ని కేసీఆర్ సరిగ్గా ప్రశ్నించడం లేదు. సమస్యలపై బీఆర్ఎస్ అగ్రనేతలు పోరాటం చేయట్లేదు. ప్రజలే ప్రధాన ఎజెండాగా ముందుకెళ్లాలని ఎన్నోసార్లు చెప్పా. కవిత వ్యవహారంతో అందరూ గందరగోళానికి గురవుతున్నారు. కేసీఆర్ చెప్పిందే ఇన్నాళ్లు తూచా తప్పకుండా పాటించా.. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనడంతోనే అవకాశాలు వచ్చాయి.. ఏ పార్టీ నన్ను కొనుగోలు చేసే ప్రయత్నం చేయలేదు.. ఏ పార్టీలో చేరుతాననే విషయం ఇప్పటికీ ప్రకటించలేదు.. త్వరలోనే అన్ని విషయాలు తెలుస్తాయి.. ఫామ్‌హౌస్ ఎపిసోడ్ కూడా ఓటమికి ఓ కారణం.. ప్రస్తుతానికి నా పొలిటికల్ కెరీర్‌కు ఎలాంటి ప్రమాదం లేదు' అని గువ్వల బాలరాజు అన్నారు.

# సినీ కార్మికులకు సీపీఐ అండ

### వేతనాలు పెంచాల్సిందేనన్న జాతీయ కార్యదర్శి నారాయణ
### సమస్య పరిష్కారం కోసం సీఎం జోక్యం చేసుకోవాలి



**హైదరాబాద్, మహా :** సినీ కార్మికులకు వేతనాలు పెంచాల్సిందేనని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్. కె.నారాయణ డిమాండ్ చేశారు. పెద్ద బడ్జెట్ సినిమాలకు 30 శాతం, చిన్న చిత్రాలకు 15 శాతంవేతనాలు పెంచాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. వారికి న్యాయం జరిగే వరకు సిపిఐ పూర్తిగా అండగా ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తక్షణమే జోక్యం చేసుకుని సినీ కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ తెలుగు సినీమా కార్మికులు తమకు వేతనాలు పెంచమంటే ముంబాయి నుంచి సినీ కార్మికులను తీసుకువచ్చి పని చేయించుకుంటామని నిర్మాతలు బెదిరింపులకు పాల్పడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇక్కడి కార్మికులకు అన్యాయం చేయాలని చూస్తే సీపీఐ ఉద్యమంలో ప్రత్యేక్షంగా పాల్గొన్నడమే కాకుండా ఎంత వరకైనా వెళ్లుతామని హెచ్చరించారు. రాష్ట్రంలో తెలుగు సినీ రంగంలో కేవలం 10 కుటుంబాలు, థియేటర్లు 4 కుటుంబాల చేతుల్లో ఉన్నాయని వారే మొత్తం ఆడిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం కేవలం సందేశాత్మక చిత్రాలకు మాత్రమే ప్రొత్సహం అందించాలన్నారు. వందల కోట్లతో సమాజాన్ని చెడుమార్గం పట్టించేలా తీస్తున్న చిత్రాలకు ఏలాంటి పరిస్థితుల్లో రాయితీలు ఇవ్వరాదని, టికెట్ల పెంపుకు అనుతులు ఇవ్వరాదనిపేర్కొన్నారు. పెద్ద పెద్ద నిర్మాతలు, హీరోలను పిలిచి మాట్లాడే ముఖ్యమంత్రి సినిమా కార్మికులను పిలిచి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు.ప్రభుత్వానికి పక్షపాతం సరికాదని కార్మికులకు ఎలాంటి అన్యాయం జరగకూడ చూడాలని కోరారు.

**చిరంజీవి నైతికతకే వదలి వేస్తున్నా..**

గతంలో ఓ సందర్భంగా సినీ నటుడు చిరంజీవిపై తాను చేసిన వ్యాఖ్యల పట్ల అప్పుడే క్షమాపణలు చెప్పి వెనక్కి తీసుకున్నానని నారాయణ తెలిపారు. చిరంజీవి చేసిన వ్యాఖ్యలకు ఆయన కౌంటర్ ఇచ్చారు. చిరంజీవిని ఉద్దేశించి గతంలో తను చేసిన వ్యాఖ్యల పట్ల అప్పుడే క్షమాపణలు చెప్పడంతో ఈ అంశం ముగిసిపోయిందన్నారు. కానీ చిరంజీవి మళ్లీ ఆ ప్రస్తావన తేవడం, ఆ వీడియోలను వైరల్ చేయడం సరికాదన్నారు. ఈ అంశాన్ని చిరంజీవి నైతికతకు, విజ్ఞతకు వదిలి వేస్తున్నాని నారాయణ పేర్కొన్నారు.

# బీఆర్ఎస్ బీసీ గర్జన వాయిదా

## ఈ నెల 14న సభ నిర్వహించనున్నట్లు నేతల వెల్లడి

- ఢిల్లీలో నిర్వహించిన ధర్నాతో కాంగ్రెస్ పార్టీకి మైలేజ్
- జాతీయ రాజకీయాల్లో సెంట్రల్ డిబేట్‌గా మార్చిన కాంగ్రెస్
- ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలన్న బీఆర్ఎస్ పార్టీ ఆలోచనకు చెక్
- సభకూ కార్యకర్తలు మొగ్గు చూపకపోవడంతో మల్లగుల్లాలు!

**హైదరాబాద్, మహా:** నేడు జరగాల్సిన బీఆర్ఎస్ బీసీ గర్జన సభను వాయిదా చేశారు. ఈ నెల 14న కరీంనగర్‌లో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నేతలు తెలిపారు. వర్షాల కారణంగా ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలును డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమం చేపట్టారు. తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో బీసీల రిజర్వేషన్లను 23 శాతం నుంచి 42 శాతానికి పెంచుతామని హామీ ఇచ్చినప్పటికీ, ఈ వాగ్దానాన్ని నెరవేర్చడంలో విఫలమైందని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. కాంగ్రెస్ తన ఎన్నికల వాగ్దానాలను మరచిపోయిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ మధుసూదన చారి విమర్శించారు. ఈ సభ ద్వారా బీఆర్ఎస్, తెలంగాణలో బీసీ సామాజిక వర్గాల హక్కుల కోసం పోరాటాన్ని బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

**కాంగ్రెస్ ధర్నా సెంట్రల్ డిబేట్‌గా..**

'మేమెంతో మాకంతా' నినాదంతో బీఆర్ఎస్ ఈ సభను నిర్వహించాలని నిర్ణయించింది. ఈ కార్యక్రమం తెలంగాణ రాష్ట్ర సాధన పోరాట తరహాలో బీసీ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని అనుకుంటోంది. కరీంనగర్‌లోని జ్యోతిరావు పూలే మైదానంలో సభ కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిన బీసీ ధర్నా జాతీయ రాజకీయాల్లో బీసీ రిజర్వేషన్లను సెంట్రల్ డిబేట్‌గా మార్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మోదీకి సూటిగా సవాల్ విసిరిన ఘటన కాంగ్రెస్‌ను బలంగా ముందుకు నెట్టింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వాయిదా నిర్ణయం రాజకీయ వ్యూహం భాగమై ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కరీంనగర్ సభ ముందుగానే జరిగి ఉంటే బీసీ అజెండాను బీఆర్ఎస్ వైపు తిప్పుకునే అవకాశం ఉండేది. కానీ ఇప్పుడు కాంగ్రెస్ బలంగా మైదానంలో నిలిచింది. దీంతో కాంగ్రెస్ ప్రచారానికి సమానంగా ప్రతిస్పందించడానికి బీఆర్ఎస్ కొత్త వ్యూహంతో ముందుకు రావాలనే ఆలోచనలో ఉందని విశ్లేషకులు చెబుతున్నారు.

# భారత్‌పై ట్రంప్ దాదాగిరి

## సుంకాల వల్ల ఉద్యోగాలు పోతాయి, ఎఫ్‌డీఐలు రావని ఆందోళన

### ప్రధాని మోదీ 56 అంగుళాల ఛాతీ ఏమైంది
### దేశ సార్వభౌమత్వాన్ని మిత్రుల కోసం తాకట్టు పెట్టారు
### ఎక్స్ వేదికగా హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ధ్వజం

**హైదరాబాద్, మహా :** భారత్‌పై అమెరికా భారీ సుంకాలను విధించడంపై ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేసినందుకు భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏకంగా 50 శాతం సుంకం విధించడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. ఇది దౌత్యం కాదని, అమెరికా అధ్యక్షుడి దాదాగిరి అని గురువారం 'ఎక్స్' వేదికగా విమర్శించారు. అమెరికా తీసుకున్న ఈ నిర్ణయం వల్ల భారత ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమవుతుందని ఒవైసీ ఆందోళన వ్యక్తం చేశారు. "ట్రంప్ మనపై మరో 25 శాతం సుంకాన్ని విధించారు, దీంతో మొత్తం సుంకం 50 శాతానికి చేరింది. అంతర్జాతీయ వాణిజ్యం ఎలా పనిచేస్తుందో తెలియని వ్యక్తి మనల్ని బెదిరిస్తున్నారు," అని ఆయన పేర్కొన్నారు. ఈ సుంకాల వల్ల భారత ఎగుమతిదారులు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ), తయారీదారులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. అంతేకాకుండా, సరఫరా గొలుసులు దెబ్బతిని, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) తగ్గిపోయి, ఉద్యోగాలకు గట్టి దెబ్బ తగులుతుందని ఆయన హెచ్చరించారు.

ఈ పరిణామాలపై ప్రధాని నరేంద్ర మోదీ మౌనాన్ని ఒవైసీ తీవ్రంగా ప్రశ్నించారు. "ఈ విషయాలు నరేంద్ర మోదీకి ఎందుకు పట్టడం లేదు? బీజేపీ నేతల ప్రగల్భాలు ఇప్పుడు ఏమయ్యాయి?" అని నిలదీశారు. గతంలో ట్రంప్ 56 శాతం సుంకాలు విధిస్తే మోదీ తన 56 అంగుళాల ఛాతీని చూపిస్తారా అని తాను ప్రశ్నించానని, బహుశా అందుకే ట్రంప్ 50 శాతంతో ఆగిపోయారేమోనని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "దేశ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని మీ మిత్రులైన బిలియనీర్ల ఖజానాలు నింపడం కోసం తాకట్టు పెట్టారా?" అని ఒవైసీ ప్రశ్నించారు. జూలై 31న కూడా ఇదే అంశంపై స్పందించిన ఒవైసీ, భారత్ ఒక స్వతంత్ర సార్వభౌమ దేశమని, అమెరికాకు సామంతు రాజ్యం కాదని అన్నారు. జపాన్‌పై 15 శాతం, వియత్నాంపై 20 శాతం, ఇండోనేషియాపై 19 శాతం సుంకాలు విధిస్తూ, భారత్‌పై మాత్రం కక్షపూరితంగా వ్యవహరించడం మన పోటీతత్వాన్ని దెబ్బతీస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

# త్వరలో భారత్ పర్యటనకు పుతిన్!

### 2022 ఫిబ్రవరి తర్వాత రావడం ఇదే మొదటిసారి
### ట్రంప్ సుంకాలు విధించిన వేళ పర్యటనకు ప్రాధాన్యత



**ఇంటర్నెట్ డెస్క్, మహా:** త్వరలో భారత్ పర్యటనకు రష్యా అధ్యక్షుడు పుతిన్ రానున్నట్లు తెలుస్తోంది. ఆయన పర్యటన తేదీలు ఖరారు చేస్తున్నట్లు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దొభాల్ వెల్లడించారు. ప్రస్తుతం రష్యా పర్యటనలో ఉన్న దొభాల్.. రష్యా భద్రతామండలి సెక్రటరీ సెర్గీ షొయిగుతో సమావేశమైన అనంతరం ఈ ప్రకటన చేశారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్ల నేపథ్యంలో భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలు విధించిన వేళ ఈ ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ఏడాది చివర్లో పుతిన్ భారత్‌కు వచ్చే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌పై దండయాత్ర అనంతరం ఆయన భారత్‌కు రావడం ఇదే మొదటిసారి అవుతుంది. ఇదిలా ఉండగా.. గత ఏడాది ప్రధాని మోదీ, పుతిన్ రెండుసార్లు కలుసుకున్నారు. జులైలో ఇరు దేశాల శిఖరాగ్ర సమావేశానికి ప్రధాని మోదీ మాస్కోకు వెళ్లారు. ఆ సందర్భంలో ఆయన ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారం 'ఆర్డర్ ఆఫ్ సెయింట్ ఆండ్రూ ది అపోస్టల్' అందుకున్నారు. అక్టోబరులో బ్రిక్స్ సదస్సు సందర్భంగా కజాన్‌లో మరోసారి సమావేశమయ్యారు.

# భువనగిరి రైతులకు శాపంగా మారిన మూసీ కాలుష్యం

- మూసీ ప్రక్షాళనపై పుట్టినరోజున మాటిచ్చిన సీఎం... ఆ తర్వాత మాటే మర్చిన వైనం
- బీసీలకు న్యాయం చేసింది బీజేపీ - వంచించింది కాంగ్రెస్
- తమ వైఫల్యాలను కేంద్రంపై నెట్టే ప్రయత్నం చేస్తున్న కాంగ్రెస్
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్

**నల్లగొండ, మహా :** ప్రజలకిచ్చిన వాగ్దానాలన్నింటినీ నెరవేర్చామంటూ చెబుతున్న సీఎం తన పుట్టిన రోజున భువనగిరి రైతులకు మూసీ ప్రక్షాలన చేస్తానని హామీ ఇచ్చి తప్పింది వాస్తవం కాదా అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ప్రశ్నించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రాంచందర్ రావు మాట్లాడుతూ, భువనగిరి ప్రధానంగా రైతుల ఆధారిత ప్రాంతమని. ఈ జిల్లాలో మూసీ నది ప్రక్షాళన, శుద్ధి చేయడం అత్యవసరమన్నారు. మూసీ ప్రక్షాళన కోసం గతంలో బీజేపీ పూర్వ రాష్ట్ర అధ్యక్షులు డా. కె. లక్ష్మణ్ నేతృత్వంలో బిజెపి ఉద్యమించిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి తన జన్మదినం సందర్భంగా యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని, ఇక్కడ పర్యటించి మూసీని శుద్ధి చేస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు ఆ మాటే మరిచిపోయారని ఎద్దేవ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం మాటలకే పరిమితమైందని, చేతల్లో అసమర్థత స్పష్టంగా కనిపిస్తోందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ తాము చేయలేని పనిని కేంద్రంపై నెట్టే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. మొన్నటిదాకా యూరియా కొరత విషయంలో రాష్ట్ర



వ్యవసాయ శాఖ మంత్రి కేంద్రాన్ని తప్పుపడుతూ అసత్య ప్రచారం చేశారన్నారు. కేంద్రం తెలంగాణకు అవసమైన దానికంటే ఎక్కువ యూరియాను పంపించిందని, ఈ వివరాలు బయటపెట్టిన తరువాత, కాంగ్రెస్ నాయకులు మాట కూడా పెకలడం లేదన్నారు. రాష్ట్రంలో యూరియా బ్లాక్ మార్కెట్ కు కారణం.. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, అసమర్థత అని అన్నారు. బీసీ రిజర్వేషన్ల పేరిట ఢిల్లీలో నిర్వహించిన కాంగ్రెస్ ధర్నా వాస్తవానికి ముస్లింలకు రిజర్వేషన్లు ఇచ్చేందుకేనని మరో సారి పేర్కొన్నారు. రాహుల్ గాంధీ డైరెక్షన్‌లో రేవంత్ రెడ్డి సహా కాంగ్రెస్ నేతలు ధర్నా పేరిట డ్రామా చేస్తున్నారని విరుచుకుపడ్డారు. ఢిల్లీలో కాంగ్రెస్ చేసిన ధర్నాకు రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ హాజరు కాలేదని పేర్కొంటూ రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయితే బీసీలకు రిజర్వేషన్లు తీసుకొస్తామని రేవంత్ చెబుతున్నారని వ్యంగ్యంగా అన్నారు. రాహుల్ గాంధీ ప్రధాని కారు, బీసీ రిజర్వేషన్లు అమలు సాధ్యం కాదని రేవంత్ చెప్పకనే చెప్పారన్నారు. బీసీల పట్ల నిజంగా కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే కాంగ్రెస్ ఇండీ అలయెన్స్ పార్టీలు అధికారంలోకి వస్తే ఒక బీసీని ప్రధాని చేస్తామని ప్రకటించాలన్నారు. బీసీలకు న్యాయం చేసేది బీజేపీ మాత్రమేనని, బీసీని ప్రధాని చేసింది, బీసీ కమిషన్‌కు రాజ్యాంగ హోదా కల్పించింది బీజేపీ అని అన్నారు. మోదీ మంత్రివర్గంలో 27 మంది బీసీలు ఉన్నారని, కానీ తెలంగాణ కాంగ్రెస్ కేబినెట్‌లో కేవలం ముగ్గురు మాత్రమేనని అన్నారు. అలాంటి కాంగ్రెస్ బీసీ సంక్షేమం గురించి మాట్లాడటం శోచనీయమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ చేసిందని, దాన్ని అమలు చేయలేకనే ఢిల్లీలో ధర్నా పేరిట డ్రామాలు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ చేస్తున్న బూటకం, నాటకం అని ప్రజలకు స్పష్టంగా అర్థమైందన్నారు. తెలంగాణలో మేం అధికారంలోకి వచ్చాక 42 శాతం రిజర్వేషన్లను బీసీలకే కల్పిస్తామని హామీ ఇచ్చారు. అందులో ముస్లింలకు రిజర్వేషన్లు ఉండవని తేల్చి చెప్పారు. రైతులకు రైతుబంధు బంద్ చేశారు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించలేదు, గత 11 ఏళ్లుగా ఉద్యోగాల కోసం ఎదురు చూసిన నిరుద్యోగులకు నెలకు రూ. 4,000 భృతి ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు మొండిచేయి చూపిస్తున్నారని విరుచుకుపడ్డారు. గతంలో బీఆర్ఎస్ మోసం చేసింది. ఇప్పుడు కాంగ్రెస్ కూడా ప్రజలను మోసం చేస్తోందన్నారు. బీఆర్ఎస్‌కాంగ్రెస్ పార్టీ కేవలం షాడో బాక్సింగ్ చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నాయన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసు, కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి కేసులో అధికారులను మాత్రమే అరెస్టు చేశారు. కానీ అవినీతికి పాల్పడ్డ రాజకీయ నాయకులను ఎందుకు అరెస్టు చేయడం లేదని నిలదీశారు.

# హ్యాపీ రాఖీ (ఆగస్టు 9)



రాఖీ పండుగ, లేదా రక్షా బంధన్, సోదరీమణులు తమ సోదరులకు రాఖీ కట్టి, వారి అనుబంధాన్ని పటిష్టం చేసుకునే పండుగ. రాఖీ అంటే కేవలం ఓ దారమేం కాదు... అది జ్ఞాపకాలను, గడిపిన క్షణాలను కలిపే బంధం. ప్రతి ఏడాది శ్రావణ మాసంలో వచ్చే తొలి పౌర్ణమి రోజునే రాఖీ పండుగ జరుపుకుంటారు. 2025 సంవత్సరానికి అనుగుణంగా ఈ పౌర్ణమి ఆగస్టు 9న,శనివారం రోజున ఉంది. అందువల్ల రాఖీ వేడుకలను ఆగస్టు 9న శనివారమే జరుపుకుంటారు. ఇది శ్రావణ మాసంలోని శుక్రవారం తరువాతి రోజు కావడం విశేషం. రాఖీ కట్టేందుకు శుభ ముహూర్తం ఎప్పుడు? జ్యోతిష్య నిపుణుల ప్రకారం,ఆగస్టు 9వ తేదీన మధ్యాహ్నం 12 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రాఖీ కట్టేందుకు అత్యంత శుభకాలంగా పరిగణించబడుతుంది. ఈ సమయంలో రాఖీ కడితే విష్ణుమూర్తి అనుగ్రహం లభించడంతో పాటు, సోదరులు, సోదరీమణులు శాంతి, సౌభాగ్యంతో తమ బంధాన్ని మరింత బలపర్చుకుంటారని పండితులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

## సన్నటి దారం.. ఎర్రని తోరణం

రాఖీ అంటేనే సోదర సోదరీమణుల బంధాన్ని మరింత బలంగా మార్చేది. అంతేకాదు వారి మధ్య ఎన్ని గొడవలున్నా.. ఎన్ని పొరపొచ్చాలున్నా అవన్నీ తాత్కాలికమేనని.. క్లిష్ట పరిస్థితులు ఎదురైనా తమకు తోడుగా ఉండాలని కోరుకుంటూ తమ సోదరుని నుండి రక్షణను కాంక్షిస్తూ ప్రతి అక్కాచెల్లెళ్లు తమ సోదరులకు రాఖీ కడతారని అందరికీ తెలిసిందే. ఒకప్పుడు తమ సోదరులు అన్ని చోట్లా విజయం సాధించాలని కోరుతూ, సన్నటి దారాన్ని ఎర్రని తోరణానికి చుట్టూ వారి చేతికి కట్టే వారు. అయితే ప్రస్తుతం కలర్ ఫుల్ రాఖీలెన్నో మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. ఇదిలా ఉండగా జ్యోతిష్యశాస్త్రం ప్రకారం ఈసారి మీ సోదరుల రాశిని బట్టి ఏ రంగు రాఖీని కడితే శుభ ఫలితాలొస్తాయనే ఆసక్తికరమైన విషయాలు సామాజిక మాధ్యమాల్లో అనేకం వ్యాప్తిలో ఉన్నాయి. విశ్వాసాల ఆధారంగా.. రంగులు రాఖీలు ఇలా ఉన్నాయి.

**మేషరాశి:** ఈరాశికి కుజుడు అధిపతి. ఈరాశి వారికి ఎరుపు రంగు రాఖీ కట్టడం వలన చాలా శుభ ఫలితాలు వస్తాయని పండితులు చెబుతున్నారు. అన్నదమ్ములు.. అక్కచెల్లెళ్ల మధ్య బంధం బలపడుతుంది. జీవితంలో ఎలాంటి ఆటంకాలు లేకుండా ముందుకు వెతతారు.

**వృషభ రాశి:** ఈ రాశికి శుక్రుడు అధిపది.. మీ అన్నదమ్ములు వృషభ రాశికి చెందిన వారైతే నీలం రంగు లేదా బూడిద రంగు రాఖీ కట్టండి. మీ సోదరుడి జీవితంలో సానుకూల ఫలితాలు కలుగుతాయని జ్యోతిష్య పండితులు చెబుతున్నారు.

**మిథున రాశి:** ఈ రాశికి బుధుడు అధిపతి.. సోదరుడికి ఎలాంటి ఇబ్బందులు .. ఆపదలు రాకుండా ఉండాలని సోదరీమణులు రక్షాబంధనం పండుగ రోజు రాఖీని కడతారు. జ్యోతిష్య శాస్త్రం ఈ ఏడాది మిథున రాశి వారికి ఆకు పచ్చని, ఎరుపు, గంధం రంగులో ఉండే రాఖీలను కట్టడం వల్ల మీ సోదరుడికి అన్నింటా విజయం లభిస్తుంది. కి అన్నింటా విజయం లభిస్తుంది.

**కర్కాటక రాశి:** ఈ రాశికి చంద్రుడు . చంద్రుడు శుభ దృష్టితో అన్నింటా విజయమే.. ఈ రాశి వారికి చంద్రుడి ఆకారంలో ఉండే తెల్లని రాఖీని కట్టాలి. ఆర్థిక స్థోమత ఆధారంగా వెండి రాఖీ కడితే ఇంకా మంచిది. ఈ రాశి వారు సాధ్యమైనంత వరకు తెల్లని వస్తువులు వాడితే ఈ ఏడాది అంతా ఆనందంగా ఉంటారని పండితులు చెబుతున్నారు.

**మకర రాశి:** ఈ రాశి వారిని శని భగవానుడు అధిపతిగా వ్యవహరిస్తాడు. వీరికి రాఖీ కట్టేటప్పుడు నీలం రంగు రాఖీని కట్టాలి. ఈ ఏడాది అంతా సంతోషంగా గడుపుతారు.

**కుంభ రాశి :** ఈ రాశికి కూడా శని భగవానుడే అధిపతి . వీరికి కూడా నీలం రంగు రాఖీ కట్టాలి. సోదరులు ఎప్పడూ సంతోషంగా ఉండేలా శనిభగవానుడి ఆశీస్సులు ఉంటాయని పండితులు చెబుతున్నారు.

**సింహ రాశి:** ఈ రాశికి సూర్యుడు అధిపతి. ఈరాశి వారికి రాఖీ కట్టేటప్పుడు ఎరుపు లేదా గులాబీ రంగుల రాఖీలను కట్టాలి. వీరికి మనో బలం పెరిగి.. ఆలోచనా శక్తి వృద్ధి చెందుతుంది.


**ధనస్సు రాశి:** ఈ రాశికి గురుడు అధిపతి. ఈ రాశిలో జన్మించిన వారికి రాఖీ కట్టేటప్పుడు పసుపురంగు, గంధం రంగు రాఖీలను కట్టాలి. దీని వల్ల వారి కెరీర్ విజయవంతంగా కొనసాగుతుంది.

**మీన రాశి:** ఈ రాశికి గురుడు అధిపతి. ఈరాశిలో పుట్టిన వారికి రాఖీ కట్టేటప్పుడు పసుపు రంగు రాఖీ కట్టాలి. ఈ ఏడాది అంతా శుభ ఫలితాలు వస్తాయని పండితులు వస్తాయని జ్యోతిష్య శాస్త్రం ద్వారా తెలుస్తుంది.

**కన్య రాశి:** ఈ రాశికి బుధుడు అధిపతిగా ఉంటాడు. వీరికి ఆకుపచ్చ , తెలుపు రంగుల్లో ఉండే రాఖీని కట్టాలి. మీ సోదరులు హ్యాపీగా ఉంటారట.

**వృశ్చిక రాశి:** ఈ రాశికి కుజుడు అధిపతిగా సంచరిస్తాడు. వీరికి రాఖీ పండుగ రోజు ఎరుపు రంగు రాఖీని కట్టాలి. మీ సోదరుని జీవితంలో ఆనందం రెట్టింపు అవుతుందని పండితులు చెబుతున్నారు.

**తులా రాశి:** ఈ రాశికి శుక్రుడు అధిపతి.. ఈ రాశివారికి రాఖీ కట్టేటప్పుడు నీలం రంగు రాఖీ కట్టాలి. ఈ ఏడాది అంతా అన్నదమ్ములు.. అక్కచెల్లెళ్లు సంతోషంగా గడుపుతారు.







**శ్రావణ లక్ష్మీ రావే మా ఇంటికి...**

## సెల్ఫీ షేర్ చేయండి!

శ్రావణలక్ష్మీ రావే మా ఇంటికి..! మీరు వరలక్ష్మీ వ్రతం చేసుకున్నారా? అయితే మీ ఇంట కొలువైన శ్రావణ లక్ష్మి ఫోటోను మీ వివరాలతో మహా పత్రిక వీక్షకులతో పంచుకోండి. అమ్మవారితో మీ ఫోటోను '9000300239' కు లేదా 7436939999 వాట్సాప్ చేయండి!
మీ ఫోటోను.. మహాలక్ష్మిలా చూడండి

# విశిష్ట వరలక్ష్మీవ్రతం

సనాతన భారతీయ ధర్మంలో శుభదాయకమైన వ్రతాల్లో ఒకటైన వరలక్ష్మీ వ్రతం, విశిష్టమైన ఆధ్యాత్మిక తాత్పర్యంతో కూడి, అమ్మవారి అనుగ్రహాన్ని కోరుకునే మహిళల నమ్మకాన్ని ప్రతిబింబిస్తుంది. పౌరాణిక విశ్వాసాలు, కుటుంబ సంపదాభివృద్ధి, సౌభాగ్య సమృద్ధి కలిగించేది ఈ వ్రతం. శ్రావణ మాసం శుక్రవారం సాయం కాలంలో, నుదుటిపై కుంకుమ పూసి, నెత్తిన కర్పూర దీపం వెలిగించి, లక్ష్మీదేవిని ప్రేమతో పూజించే ఈ సందర్భం, ఒక్క మహిళలకే కాదు, కుటుంబానికే మంగళాన్ని పంచుతుంది.

**లక్ష్మి దేవిని కరుణించే వ్రతం:**

వరలక్ష్మీ వ్రతం అనేది ఆది శంకరాచార్యులు ఆదేశించిన విశిష్టమైన వ్రతాల్లో ఒకటి. "సౌభాగ్య లక్ష్మీ" రూపంగా భక్తుల గృహాల్లోకి తాను ప్రవేశించడానికి ఈ రోజు ఓ సాధన వేదిక. "ధన్యం ధాన్యం పశుం పుత్రాన్ విద్యాం ఆయుర్యశస్సు చ" అనే ఆశీస్సుల ధ్వని ఈ వ్రతాన్ని ప్రతి ఇంటిలో ప్రతిధ్వనింప జేస్తుంది. శ్రావణ మాసంలోని రెండవ శుక్రవారం ఆచరించే ఈ వ్రతాన్ని ముద్దుతో కూడిన భక్తి, కఠినంగా పాటించే నియమ నిష్టలతో చేస్తే లక్ష్మీదేవి కరుణ ప్రసాదించుతుందని విశ్వాసం. "ఆలయమందు కాదు గానీ హృదయాలయము లో లక్ష్మి నారాయణులు తిష్టించేందుకు" ఈ వ్రతం గొప్ప మార్గం.

**పౌరాణిక నేపథ్యం – పార్వతీ దేవికి అమ్మవారి దర్శనం:**

పౌరాణిక గ్రంథాల ప్రకారం, ఈ వ్రతాన్ని మొదటగా గౌరీదేవి స్వయంగా ఆచరించారని చెబుతారు. పార్వతీదేవి విష్ణు పత్నిగా ఉన్న లక్ష్మీదేవిని తిలకించాలనే తపనతో ఈ వ్రతాన్ని చేయగా, అమ్మవారి సాక్షాత్కారం కలిగిందట. అప్పటినుంచి ఈ వ్రతానికి విశేష ప్రాముఖ్యత ఏర్పడింది. "పరమేశ్వరి ఆశీస్సులతో నిండి, లక్ష్మీదేవి కరుణ కదలిలా ప్రవహించే వ్రతమే వరలక్ష్మి వ్రతం." అందుకే, స్త్రీలు తమ కుటుంబ సంపద, ఆరోగ్యం, ఐశ్వర్యం కోసం ఈ వ్రతాన్ని అధిక భక్తితో చేస్తారు.



**పూజ విధానం – పుష్పాలతో పరిమళించే వ్రత కృత్యం:**

వ్రతానికి ముందు రోజు ఇంటిని శుభ్రంగా నిర్వహించి, వ్రత మండపం సిద్ధం చేస్తారు. కలశాన్ని అమర్చడం, దాని పైన అమ్మవారి ముఖాన్ని పెట్టడం, పసుపు, కుంకుమ, గంధ, పుష్పాలతో అలంకరించడం జరుగుతుంది. వ్రత పూజలో అష్టలక్ష్మీ స్తోత్రం, వరలక్ష్మీ అష్టోత్తర శతనామావళి వంటి పఠనాలు ప్రత్యేకంగా ఉంటాయి.

**ప్రత్యేకత:**

కలశంలో సువర్ణ నాణేలు, బియ్యం, పసుపు, కుంకుమలు నింపుతారు. అమ్మవారికి పాయసం, పానకము, లడ్డూ, అర్ధాన్నం వంటి నివేదనలు సమర్పిస్తారు. మహిళలు హరిద్రాకుంకుమను ఇవ్వి, సౌభాగ్య కాంక్షతో సుమంగళిగా గౌరవిస్తారు.

**సాంప్రదాయాల సంకేతం – మహిళా శక్తికి మంగళ వేదిక:**

ఈ వ్రతం, కేవలం ఆధ్యాత్మిక అనుష్టానమే కాదు - భారతీయ మహిళల సంకల్పబలాన్ని, కుటుంబ అనురాగాన్ని ప్రతిబింబించే సాంప్రదాయిక వేదిక కూడా. "ఇల్లే దేవాలయం - ఇంటి మహిళే దేవత" అనే భావనకు వరలక్ష్మీ వ్రతం జీవం పోస్తుంది.

వివాహితులే కాక, అమ్మవారి భక్తిగా ఉన్న కుశలమతి కన్యలు కూడా ఈ వ్రతాన్ని ఆచరిస్తే మంచి వరుడు లభిస్తారని విశ్వాసం ఉంది. వ్రతానికి మనస్ఫూర్తిగా అంకితమైతే, "లక్ష్మి నీవు ఉండే ఇంటిలో, దారిద్ర్యానికి తలుపు లేదంటారు" అన్న సామెత సత్యమవుతుంది.

**నేటి సామాజిక సందర్భంలో వరలక్ష్మీ వ్రతం ప్రాసంగికత:**

ఆధునిక జీవనశైలిలో మహిళలు ఉద్యోగ బాధ్యతలు, కుటుంబ పరిరక్షణ, పిల్లల సంరక్షణతో అలసిపోయే సమయంలో ఇలాంటి ఆధ్యాత్మిక సందర్భాలు వారి ఆత్మ బలానికి, భౌతిక ధైర్యానికి ఆధారంగా నిలుస్తున్నాయి. ఒక రోజు అమ్మవారి పూజకు, కుటుంబ ఐక్యతకు అంకితం చేయడం ద్వారా, మానవ జీవితానికి విలువలు, విశ్వాసాలు పునరుద్ధరించబడతాయి. ఇది కేవలం సంప్రదాయం కాదు, సంపద సాధనకు సౌమ్య మార్గం.

- గడల నరసింహారావు,
ఖమ్మం, మహా పత్రిక జిల్లా ప్రతినిధి



## మహాదేవపూర్ సిఐ రామచందర్ రావు ఆకస్మిక బదిలీ

**కాటారం మహా :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని మహాదేవపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రామచందర్ రావు గురువారం ఆకస్మిక బదిలీ అయ్యారు. సి ఐ మహాదేవపూర్ నుండి కరీంనగర్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ కు బదిలీ అయ్యారు. కొన్ని నెలలు మాత్రమే పని చేసిన సిఐ రామచంద్ర రావు ఈ ప్రాంతంలో మంచి పేరు తెచ్చుకున్నారు. కాలేశ్వరం పుణ్యక్షేత్రంలో సరస్వతి పుష్కరాల సమయంలో విధి నిర్వహణలో గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రత్యేకంగా సిఐ బదిలీకి ఒక్కరికే ఉత్తర్వులు వెలువడడం విశేషం.

## అదానీ కబ్జా నుంచి అటవీ భూమిని కాపాడండి

### కేంద్ర అటవీశాఖ మంత్రికి బృందాకరత్ లేఖ..

**మహా:** ఛత్తీస్‌గఢ్ అటవీ శాఖ తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ కేంద్ర అటవీ, పర్యావరణ శాఖమంత్రి భూపేందర్ యాదవ్‌కు మాజీ ఎంపీ, సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ ప్రత్యేక ఆహ్వానితురాలు బృందాకరత్ లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఫలితంగా 1742 హెక్టార్ల దట్టమైన అటవీ భూమి విధ్వంసానికి గురవుతుందని ఆమె ఆ లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ఈ విషయంలో జోక్యం చేసుకుని కెంటె బొగ్గు ప్రాజెక్టు విస్తరణ పనుల అమలును నిలిపివేయాలని కోరారు. ఈ ఏడాది జూన్‌లో సుర్గుజా జిల్లా అటవీ శాఖాధికారి ఆ సైట్‌లో తనిఖీ జరిపిన తర్వాత ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఆ ప్రాజెక్టుకు పచ్చజెండా ఊపింది. హస్డియోఅరండ్ ప్రాంత బొగ్గు ప్రాజెక్టులో భాగమైన ఈ ప్రాజెక్టు నిర్వహణా భారాన్ని రాజస్థాన్ ప్రభుత్వ విద్యుత్ సంస్థకు అప్పగించారు. రాజస్థాన్ పూర్వపు ప్రభుత్వం అదానీ ఎంటర్‌ప్రైజెస్ అయిన పర్సా కెంటె కాలరీస్ లిమిటెడ్‌తో జాయింట్ వెంచర్ ఏర్పాటు చేసింది. ఇందులో అదానీకి 74శాతం వాటా వుంది. హస్డియోపర్సా బొగ్గు ప్రాజెక్టుకు ఈ కంపెనీని ఆపరేటర్‌గా నియమించారు. రికార్డులను పరిశీలిస్తే ఈ వెంచర్ కింద గణనీయమైన మొత్తంలో బొగ్గు ప్రయివేటు కంపెనీకి చెందిన విద్యుత్ ప్రాజెక్టులకు మళ్లించబడుతోందని వెల్లడైంది. పైగా తిరస్కరించబడిన బొగ్గు అనే పేరుతో ఇదంతా సాగుతోంది. ప్రజా ప్రయోజనాల పేరుతో ఈ బొగ్గు ప్రాజెక్టును చేపట్టి, అనుమతులు పొందినా నిజానికి అందులో ప్రజల ప్రయోజనాలకు సంబంధించి ఏమీ లేవని, అంతా ప్రయివేటు ప్రయోజనాలే అమలవుతున్నాయని, ఖనిజ వనరులు దోపిడీకి గురవుతున్నాయని బృందాకరత్ లేఖ పేర్కొంది. ఈ ప్రాజెక్టును అమలు చేస్తే, ఇప్పటికే మైనింగ్ పేరుతో తీవ్రంగా దెబ్బతిన్న ప్రాంతాలు మరింత వినాశనానికి గురవుతాయని అన్నారు. అధికారిక తనిఖీల నివేదిక ప్రకారం, నాలుగున్నర లక్షల చెట్లను కొట్టేస్తున్నారు. ఇవన్నీ కూడా దట్టమైన అటవీ భాగంలోనే వున్నాయి. ఓపెన్‌కాస్ట్ మైనింగ్ వల్ల ఇప్పటికే ఈ ప్రాంతంలోని వేలాది చెట్లు ధ్వంసమయ్యాయి. జలాలు కలుషితమయ్యాయి. భూసారం దెబ్బతింది. పైగా గ్రామ సభల అభిప్రాయాలను పూర్తిగా విస్మరించి మరీ ఈ ప్రాజెక్టులను చేపడుతున్నారు. ఇలాంటి ప్రాజెక్టులకు గ్రామసభల ఆమోదం తప్పనిసరని రాజ్యాంగ, చట్ట నిబంధనలు చెబుతున్నా పట్టించుకోవడం లేదు. ఓపెన్ కాస్ట్ మైనింగ్ వల్ల వాస్తవ ప్రాజెక్టును మించి చాలా పెద్ద మొత్తంలో భూభాగం ప్రభావితమవుతుంది.



## బెల్లంపల్లి సబ్-కలెక్టర్‌గా మనోజ్

**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి సబ్‌కలెక్టర్ గా ఐ.ఈ.ఎస్.ఎస్.డి. మనోజ్ (ఐ.ఎ.ఎస్) గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తన ఛాంబర్ లో మర్యాదపూర్వకంగా మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ బెల్లంపల్లి మండలం, కన్నాల పంచాయతీ, బుగ్గ రాజేశ్వరుడి దేవాలయంలో కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి తాసిల్దార్ కృష్ణ, ఆలయ అర్చకులు శ్రీరాంభట్ల వేణుగోపాల శాస్త్రి, సతీష్ శర్మ, బుగ్గ అన్నదాన ట్రస్ట్ చైర్మన్ మాసాడి శ్రీదేవి శ్రీరాములు, కన్నాల మాజీ సర్పంచ్ జిల్లపల్లి స్వరూప, ట్రస్ట్ సభ్యులు వెంకటస్వామి, మురుకూరి బాలకృష్ణ, భావన్లపల్లి భరత్ పాల్గొన్నారు.



## హక్కులను తెలుసుకొని వాటిని వినియోగించుకోవాలి

### జిల్లా సీనియర్ సివిల్ జడ్జి ఏ. నాగరాజ్

**భూపాలపల్లి, మహా :** భారత రాజ్యాంగంలో పొందుపర్చబడిన గిరిజన హాకులు ఏమున్నాయి అనేది తెలుసుకొని వాటిని వినియోగించుకోవాలని న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి,సీనియర్ సివిల్ జడ్జి ఏ. నాగరాజ్ తెలిపారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో గురువారం సమావేశం నిర్వహించారు. గిరిజన హక్కుల పరిరక్షణ, హక్కుల వినియోగం అనే అంశం మీద గౌరవనీయులు జడ్జి ఏ నాగరాజు ప్రసంగించారు. విద్యార్థులు హేతుబద్ధమైన ప్రశ్నలు వేయడం అలవాటు చేసుకోవాలన్నారు. ప్రశ్నించడం మర్చిపోయిన వ్యక్తి తన ఉనికిని కోల్పోతాడని అన్నారు. విద్యార్థులు పోషక ఆహారాన్ని భుజించాలని, ఆరోగ్యంగా వున్నప్పుడే చదువుకోవడం సాధ్యమవుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జిఎస్.ఆర్. దిలీప్ కుమార్ నాయక్, గవర్నమెంట్ ప్లీడర్ బొట్ల సుధాకర్, అడ్వొకేట్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు వి. శ్రీనివాస చారి , ప్రధాన కార్యదర్శి వి. శ్రావణ్ రావు, పాఠశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ సమ్మయ్య నాయక్ , లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్స్ కంప అక్షయ , జి.ప్రియాంక , సీనియర్ న్యాయవాదులు పగడాల ఆనందరావు , మొయినుద్దీన్, సంధ్య పాల్గొన్నారు.

## అక్షరాస్యత జిల్లాగా మంచిర్యాలకు పేరు తేవాలి

### జిల్లా అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య

**మంచిర్యాల, మహా :** నిరక్షరాస్యులు లేని అక్షరాస్యత జిల్లాగా మంచిర్యాలకు పేరు తేవాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ పి చంద్రయ్య అన్నారు. నవభారత సాక్షరత కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్, జిల్లా విద్యాధికారి ఎస్. యాదయ్య, విద్యాశాఖ అదనపు సంచాలకులు శ్రీనివాస చారి లతో కలిసి ప్రారంభించారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమం ప్రత్యేకంగా 3 అంశాలతో ఉంటుందని, మొదటిది 15 సంవత్సరాలు దాటిన నిరక్షరాస్యులకు విద్యను అందించడం, రెండవది 10వ తరగతి, ఇంటర్ అనుత్తీర్ణులైన వారిని ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయడం, మూడవది సమాజంలో ప్రత్యేక అవసరాలు కలిగిన వారికి చేయూత అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ అక్షరాస్యతా కార్యక్రమాలలో పాల్గొని సమాజంలో ఉన్న నిరక్షరాస్యతను నిర్మూలించవలసిన అవసరం మనందరిపై ఉందని పేర్కొన్నారు. ప్రతి మండలం నుండి ఇద్దరు రిసోర్స్



పర్సన్లు మండల కేంద్రంలో జరిగే శిక్షణలో పాల్గొని గ్రామస్థాయిలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. 1971 నుండి వయోజన విద్యా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని, ఇందులో భాగంగా జిల్లాలోని 31 వేల 435 మంది నిరక్షరాస్యులను గుర్తించి వాలంటీర్ల ద్వారా చదువు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఛత్రు నాయక్, కమ్యూనిటీ మొబైల్ అధికారి చౌదరి, క్వాలిటీ కోఆర్డినేటర్స్ సత్యనారాయణ మూర్తి, శ్రీనివాస్, జిల్లా సైన్స్ అధికారి రాజగోపాల్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ వేతనాలు చెల్లించాలి - ఏఐటీయూసీ

**ఆదిలాబాద్ మహా :** కాగజ్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రి (TVVP) లో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బందికి పెండింగ్ బకాయిలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. గురువారం సంఘ నాయకులు, సిబ్బందితో కలిసి ఆసుపత్రి ప్రధాన ద్వారం ముందు బైఠాయించారు. నాలుగు నెలల వేతనాలు వెంటనే చెల్లించి, పీఎఫ్ పూర్తి వివరాలు తెలియజేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ & ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో హాస్పటల్ ముందు కార్మికులు విధులు బహిష్కరించి ధర్నా నిర్వహించారు. వేతనాలు, ESI, PF కట్టకుండా అనేక సంవత్సరాలుగా కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం చూపుతున్నారని, అధికారులూ ఇప్పటికీ చర్యలు



తీసుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు తక్కువ వేతనాల్లో సేవలందిస్తూ కుటుంబాలపై భారం మోస్తున్నారు. అయినా కూడా వేతనాలు చెల్లించకుండా ప్రభుత్వం, కాంట్రాక్టర్లు కాలయాపన చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది రాము, ఇమ్రాన్, సాయి, తిరుమల, పుష్ప, మీనాక్షి, రాజేష్, నరేష్, భాగ్య, శారదా, నిర్మల, మునేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగుల సింహ గర్జనను విజయవంతం చేయాలి

### ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు మంతెన చిరంజీవి మాదిగ

**కాటారం, మహా :** హైదరాబాద్ లో జరిగే వికలాంగుల సింహగర్జన సభను విజయవంతం చేయాలని కాటారం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు మంతెన చిరంజీవి మాదిగ అన్నారు. గురువారం కాటారం మండలంలోని గంగారం గ్రామంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్చార్జ్ దుమ్మ వెంకటేశ్వర మాదిగ పాల్గొన్నారు.రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి 18 నెలలు గడిచినా ఆసరా పెన్షన్ లు, గీత కార్మికులకు,బీడీ కార్మికులకు, వికలాంగులకు పెంచుతానన్న పింఛన్ల హామీ నెరవేర్చలేదని ఆరోపించారు.పెన్షన్ లు పెంచకుండా పింఛన్దారుల పట్ల ప్రదర్శిస్తున్న వివక్షను వెంటనే విడనాడి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా చేయూత పెన్షన్లను అన్నింటినీ పెంచాలని, ముఖ్యంగా వికలాంగులకు రూ 6000, తీవ్రవైకల్యం కలిగిన వికలాంగులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాదిరిగానే 15 వేల రూపాయల పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వికలాంగులకు సంబంధించి ప్రధానమైన 25 డిమాండ్లను కాంగ్రెస్



పార్టీ ఏఐసీసీ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో వికలాంగులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలనే అంశాలను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు.ఆగస్టు 13 న హైదరాబాద్ కేంద్రంగా జరిగే వికలాంగుల చేయూత పెన్షన్దారుల మహా గర్జన సదస్సును మండలంలో ఉన్న వికలాంగులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల భూపాల్ పల్లి జిల్లా అధ్యక్షులు దుర్గం శంకరన్న, గంగారం గ్రామ కమిటీ వికలాంగుల అధ్యక్షులు మంతెన రాజశేఖర్, సత్యం, లావణ్య, సతీష్, కొలువురు సంతోష్, సమ్మక్క పాల్గొన్నారు.

## నర్సరీల చట్టం ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు

### జిల్లా ఉద్యానవన శాఖ అధికారి

**భూపాలపల్లి, మహా :** నర్సరీల చట్టాన్ని ఉల్లంఘించి పంటల నారును పెంచితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఎడ్ల సునీల్ కుమార్ హెచ్చరించారు. చిట్యాల మండలంలోని జూకల్,చల్లగరిగే గ్రామ శివారులలో అనుమతి పొందిన మిరప నర్సరీలను పరిశీలించారు. లైసెన్సుతో కూడిన నర్సరీలపై పర్యవేక్షణ మరింతగా బలపరచనుందని తెలిపారు. ముఖ్యంగా నర్సరీలో సస్యరక్షణ చర్యలు, నారు వయసు, అమ్మకాలు మొదలైన వివరాలను రిజిస్టర్లలో నమోదు చేయాలని, మిరప నారును కేవలం 35 నుంచి 40 రోజుల వరకే పెంచాలనీ, అనంతరం వాటి ఉత్పత్తి వివరాలు నమోదు చేయాలనీ ఆయన సూచించారు.



జిల్లాలో ఈ సంవత్సరం 10 మిరప నర్సరీలకు లైసెన్సులు రెన్యూవల్ చేసినట్లు తెలిపారు. లైసెన్సుదారులు నర్సరీ చట్టం ప్రకారం విధిగా నిబంధనలు పాటించాలని, నర్సరీ నిర్వహణలో రిజిస్టర్లు తప్పనిసరిగా నిత్యము అప్డేట్ చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు.

## తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ప్రదాత ఆచార్య జయశంకర్

### గత ప్రభుత్వం అభివృద్ధి పనులను పూర్తి చేయలేక ఆరోపణలు

### తెలుగుదేశం, కాంగ్రెస్, భాజపాలు ఒక్కటే.. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ వ్యాఖ్యానం

**మంచిర్యాల :** తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ప్రదాత ప్రొఫెసర్, ఆచార్య జయశంకర్ అని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ వాక్యానించారు. గురువారం పాత మందమర్రి చౌరస్తాలో ఆచార్య జయశంకర్ విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు దేశపతి శ్రీనివాస్, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా మార్కెట్ లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్థూపానికి పూలమాలలు వేసినా అనంతరం బెల్లంపల్లి చౌరస్తాలో తెలంగాణ రాష్ట్ర ప్రదాత స్వర్గీయ ఆచార్య జయశంకర్ స్థూపాన్ని ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ ముఖ్యమంత్రిగా చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తన అత్యంత సహచరుడు, ప్రస్తుత కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలు అమలు కాని హామీలను ఇచ్చి గద్దెకెక్కారని విమర్శించారు. కాలేశ్వరం ప్రాజెక్టు, మేడిగడ్డ బ్యారేజీలు కుంగిపోయాయని బీఆర్ఎస్ పై అసత్య ప్రచారం చేస్తూ ఇంజనీర్లు తదితరుల 19 మందిపై కేసులు పెట్టారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రజలు అడుగుతారనే భయంతో గత కెసిఆర్ సర్కార్ పై అనవసర ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. గోదావరి పరివాసిక ప్రాంతంలో సింగరేణి పరిశ్రమ ఏర్పాటు వల్ల, కార్మికుల ప్రాణ త్యాగాల వల్ల ఈ ప్రాంతాలు అభివృద్ధి లోకి వచ్చాయని అన్నారు. ఈ నల్ల బంగారు నేలలో కవులకు, కళాకారులకు పెట్టింది పేరని చెప్పారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చక ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని చెప్పారు. రానున్నది మళ్లీ కెసిఆర్ ప్రభుత్వమేనని జోష్యం చెప్పారు. అనంతరం చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధి కొరకు వందల కోట్ల రూపాయలు తీసుకువచ్చానని వెల్లడించారు. తన వ్యయంలో శంకుస్థాపనలు, భూమి పూజలు చేసి పనులు ప్రారంభించిన మందమర్రి రైల్వే ఫ్లైఓవర్, రామకృష్ణాపూర్ ఫ్లైఓవర్, కుందారం ఆసుపత్రి తదితరులను కాంగ్రెస్ ఎమ్మెల్యే గడ్డం వివేకానంద ప్రారంభించి గొప్పలు చెప్పుకుంటున్నారని దుయ్యబట్టారు. కాలేశ్వరం ప్రాజెక్టు నుండి చెన్నూరు ప్రాంతానికి లక్ష ఎకరాలు నీరు అందించేందుకు ఎత్తిపోతల పథకానికి 1600 కోట్లను తీసుకువస్తే రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆ నిధులను వెనుకకు తీసుకుందని పేర్కొన్నారు. 500 కోట్ల రూపాయలతో శంకర్ పల్లి సమీపంలో పామాయిల్ పరిశ్రమను పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి కేటీఆర్ తో భూమి పూజ చేపిస్తే కాంగ్రెస్ ఎమ్మెల్యే వివేక్ ఆ పరిశ్రమను పట్టించుకోకపోవడంతో అది బెల్లంపల్లికి తరలిపోయిందని వాపోయారు. అది ఈ ప్రాంతంలో ప్రారంభమవుతే దాదాపు రెండు, మూడు వందల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశం ఉండేదని వివరించారు. చెన్నూరు కేంద్రంలో 100 పడకల ఆసుపత్రి, బస్సు డిపో ఏర్పాటును అడ్డుకున్న ఘనత కార్మిక శాఖ మంత్రి వివేక్ దేనని చెప్పారు. దాదాపు రెండు సంవత్సరాలుగా కొనసాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వంలో స్థానిక ఎమ్మెల్యే, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ నిధులు తీసుకురావడంలో విఫలమవుతున్నారని ఘాటుగా విమర్శించారు. తాను చేసిన అభివృద్ధి తప్ప తాను కొత్తగా చేసింది ఏమీ లేదని ఎద్దేవా చేశారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ తాను ఏ ఎస్ పి గా బెల్లంపల్లిలో మొదటగా తన ప్రస్థానం మొదలైందని అన్నారు. అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడ్డాక తాను సాంఘిక సంక్షేమ గురుకులాల కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న క్రమంలో ఎర్ర బస్సు ఎక్కని ఎందరో విద్యార్థులను ఏర్ బస్సు ఎక్కించానని వెల్లడించారు. నాడు నిండుకుండలా గోదావరి అన్నారు. కానీ నేడు ఎండిన ఎడారిలా గోదావరి నది ప్రాంతం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో చెన్నూరు నియోజకవర్గం ఇన్చార్జి డాక్టర్ రాజా రమేష్, మందమర్రి పట్టణ అధ్యక్షులు జంగిలి రవీందర్, బత్తుల శ్రీనివాస్, తోట సురేందర్, ఎండి అబ్బాస్, బండారి సూరిబాబు, బట్టు రాజ్ కుమార్, కొంగల తిరుపతిరెడ్డి తదితరులు ఉన్నారు. చాలా రోజుల తర్వాత భారత రాష్ట్ర సమితి బహిరంగ సభ నిర్వహించడంతో చెన్నూరు నియోజకవర్గ పార్టీ శ్రేణులకు కొత్త జోష్ తెచ్చి పెట్టిందనే చెప్పవచ్చు.



## నిర్మల్ జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా హాస్పిటళ్లు

### ఖానాపూర్ లో డీఎంహెచ్‌వో తనిఖీలు

### ఓ క్లినిక్, మరో హాస్పిటల్ సీజ్



**ఆదిలాబాద్ మహా :** నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రులను నిర్మల్ జిల్లా వైద్యాధికారి రాజేందర్ ఆకస్మికంగా తనిఖీ చేసి సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత కొన్ని సంవత్సరాల నుండి గీత క్లినిక్ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ ప్రకారం తనిఖీలు నిర్వహించగా, గీత క్లినిక్ యజమాని, యునాని డాక్టర్గా వ్యవహరిస్తున్నారని, లోపల మాత్రం వేరే రకమైన ఇంజక్షన్లు ఉన్నాయన్నారు. అలాంటివి ఆయన వాడకూడదని తెలియజేశారు. సూర్య ఆసుపత్రిలో ఎలాంటి అనుమతి పత్రాలు, డాక్టర్ లేకుండా, ఆస్పత్రిని నడిపిస్తున్నందుకు ఈ రెండింటిని సీజ్ చేశామన్నారు. ఇలాంటివి ఖానాపూర్ లో చాలా వరకు ఉన్నాయని మా దృష్టికి వచ్చిందన్నారు. వాటినీ కూడా పరిశీలిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో సంపూర్ణ అక్షరాస్యతకు కృషి చేయాలి - కలెక్టర్

**ఆదిలాబాద్ మహా:** జిల్లాలో మహిళల అక్షరాస్యతా శాతాన్నిగణనీయంగా పెంచాల్సిన అవసరముందని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం డీఆర్డీఓ, విద్యాశాఖ ఇతర అధికారులతో కలిసి ఉల్లాస్ నవభారత్ సాక్షరతా జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శిక్షణా మాన్యువల్, అక్షర వికాసం, మార్గదర్శి కరదీపిక బుక్స్ ను ఆయన ఆవిష్కరించారు. డీఆర్ డీవో, మెప్మ తో పాటు పలు శాఖల జిల్లా రిసోర్స్ పర్సన్ల కు ఆయన పలు సూచనలు చేసారు. మహిళల అక్షరాస్యత పై ఎక్కువగా దృష్టి సారించాల్సిఉందన్నారు. జిల్లాలో పురుషుల అక్షరాస్యతా 70 నుండి 75 శాతం ఉంటే మహిళలు 50 నుండి 55 శాతం మాత్రమే ఉన్నారన్నారు. జిల్లాలో చేస్తున్న ఎన్ రోల్ మెంట్ లో మహిళలు ఎక్కువగా ఉండేలా చూడాలన్నారు. జిల్లా రిసోర్స్ పర్సన్లు ఎమ్మార్పీలకు ఈ విషయాలపై శ్రద్ధ వహించేలా తగు సూచనలు ఇవ్వాలన్నారు. ఎన్రోల్ మెంట్ మాత్రమే కాకుండా డైలీ హాజరయ్యే విధంగా చూసి హాజరు శాతాన్ని కూడా నమోదు చేయాలన్నారు. జిల్లాలో ఉల్లాస్ కార్యక్రమం ద్వారా 32821 మంది చదువురాని , వయోజన విద్యకు అర్హులైన వారిని గుర్తించామన్నారు.25,996 మందిని ఉల్లాస్ యాప్ లో రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందని తెలిపారు.అలాగే వయోజన విద్య ద్వారా చదువు నేర్పించేందుకు 1192 మంది వాలంటీరు ఉల్లాస్ యాప్ లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం 26, 312 కు చేరువలో ఉన్నామని త్వరితగతిన పూర్తి చేయాలని ఆన్నారు.ఓపెన్ స్కూల్ లో 1698 మంది టార్గెట్ కాగా లక్ష్యాలను అధిగమించి 2753 గుర్తించామన్నారు. 625 మంది వెబ్సైట్ లో రిజిస్టర్డ్ చేసుకున్నారని, అడ్మిషన్లు చివరి తేదీ ఈ నెల 18 వరకు ఉందని పేర్కొన్నారు.జిల్లాలో అక్షరాస్యత శాతం 66 ఉందని వంద శాతం పూర్తి చేయుటకు కృషి చేయాలనీ, మహిళల్లో అక్షరాస్యత పెంచుటకు అవగాహన కల్పించాలని ఆన్నారు.ఈ శిక్షణా కార్యక్రమం అనంతరం తమ ప్రాంతాల్లో ఉల్లాస్ కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డీఆర్ డీవో రవిందర్, డీఈఓ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సీవీయన్ రాజు, ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ అశోక్, తదితరులు పాల్గొన్నారు





## సుంకిడి వాగులో ఒకరి దుర్మరణం...

**తలమడుగు మహా:** వాగులో ఒక వ్యక్తి శవం తేలిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం తలమడుగు మండలంలోని సుంకిడి గ్రామానికి చెందిన దాసరి ప్రశాంత్(50) తన తాత యొక్క భూమి తన తండ్రి దాసరి ఎర్రన్న పేరుపై చేయకుండా, దాసరి లింగన్న రిజిస్ట్రేషన్ చేసుకోగా గత సంవత్సరం నుంచి ఎక్కువ మద్యానికి బానిసై ప్రతిరోజు ఇంట్లో మనభూమి మనం చేసుకోవాలని గొడవ పడుతూ ఉండేవారు. బుధవారం కూడా ప్రొద్దున 10 గంటలకు గొడవ పడి వెళ్ళిన ప్రశాంత్ అర్ధరాత్రి అయినా రాకపోవడంతో కుటుంబీకులు చుట్టుపక్కలంతా వెతికిన ఆచూకీ దొరకలేదు. గురువారం ఉదయం 8 గంటలకు సుంకిడి వాగులో ఓశవం తేలి ఉండటంతో ఆ శవాన్ని బయటకు తియ్యగా దాసరి ప్రశాంత్ అని తన తండ్రి దాసరి ఎర్రన్న నిర్ధారించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాధిక వెల్లడించారు. మృతుడికి భార్య ఆరు సంవత్సరాల కుమారుడు ఉన్నారు.

## ఓ తల్లి అక్రమ సంబంధం కొడుకు ప్రాణం తీసింది..!?

### తన చావుకు తల్లి కారణమని మరణ వాంగ్మూలం

### మృతికి కారణమైన వ్యక్తి ఇంటి ముందర మృతదేహంతో ఆందోళన

**మంచిర్యాల, మహా :** ఓ తల్లి వివాహేతర సంబంధం తన కన్న కొడుకు ప్రాణం తీసిన ఘటన గురువారం నెన్నెల మండలం, గంగారం గ్రామంలో కలకలం రేపింది. గ్రామస్తుల కథనం ప్రకారం గంగారం గ్రామానికి చెందిన మృతుడి తల్లి రాజేశ్వరికి, ఆవడం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ తిరుపతికి గత కొంతకాలంగా వివాహేతర సంబంధం కొనసాగుతుందని తెలిపారు. బుధవారం ఏదో పనిపై బయటికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చిన మృతుడు అనిల్ (20) కు తల్లి తిరుపతిలు కంటపడినట్లు చెప్పారు. ఇదేంటిదని తల్లిని ప్రశ్నిస్తే ఆమె దురుసుగా బదిలించినట్లు తెలుస్తోంది. ఈ అవమానాన్ని తట్టుకోలేక అనిల్ తన మొబైల్ ఫోన్ లో తన తల్లి వివాహేతర సంబంధం వల్ల తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు వీడియో తీసి సంహారక మందు సేవించినట్లు సమాచారం. దీనిని గ్రహించిన కుటుంబ సభ్యులు అనిల్ ను హుటాహుటిన మంచిర్యాలలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లినట్లు తెలుస్తోంది. కాగా అనిల్ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు సమాచారం. మరణ వార్తతో కోపోద్రిక్తులైన మృతుని తండ్రి బాపు, అతని కుటుంబ సభ్యులు అనిల్ మృతదేహాన్ని ఆటో డ్రైవర్ ఇంటి ఎదుట ఉంచి ఆందోళనకు దిగారు. ఈ సంఘటన గ్రామంలో తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. మృతుని బంధువులు ఆగ్రహంతో తిరుపతి ఇంట్లోకి వెళ్లి ఇంటికి నిప్పు పెట్టారు. గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకోవడంతో బెల్లంపల్లి ఎసిపి రవికుమార్ హుటాహుటిన పోలీసు బలగాలతో ఆవుడం గ్రామానికి చేరుకుని మృతుడి బంధువులను శాంతింపజేశారు. గ్రామంలో ఎలాంటి ఘర్షణలు జరగకుండా పోలీసులతో భారీ బందోబస్తు నిర్వహించారు. ఇది ఇలా ఉండగా తన చావుకు తల్లి కారణమని మృతుడు అనిల్ మరణ వాంగ్మూలం ఇచ్చినట్లు కథనాలు వినిపిస్తున్నాయి. పూర్తి సమాచారం తెలియవలసి ఉంది. కాగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



## ఉపాధి హామీ పథకం పై కేంద్రం వివక్ష : దండు రమేష్

**కాటారం, మహా :** దక్షిణాది రాష్ట్రాల్లో ఉపాధి హామీ పథకాన్ని నేరుగార్చేందుకు కేంద్ర ప్రభుత్వం వివక్ష కనబరుస్తోందని తెలంగాణ రాష్ట్ర ఉపాధి హామీ కౌన్సిల్ సభ్యులు దండు రమేష్ ఆరోపించారు. గురువారం కాటారంలో సోషల్ ఆడిట్ ప్రజా వేదిక కార్యక్రమంలో మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం లో ఉన్నప్పుడు చట్టబద్ధత కల్పించి కూలీలకు పెద్ద ఎత్తున ఉపాధి కల్పించిందన్నారు బిజెపి ప్రభుత్వం ఈ పథకాన్ని ఎత్తి వేయకుండా నిధులను తగ్గిస్తూ నిబంధనలను ఎక్కువగా అమలు చేస్తోందని విమర్శించారు.ఏడాదికాలంగా కొత్త జాబ్ కార్డులు ఇవ్వడం లేదని కుటుంబంలో మాత్రమే 100 పని దినాలు కల్పిస్తూ ఫ్రీజింగ్ పెట్టారని అన్నారు. కుటుంబంలో ఎంత మంది సభ్యులు ఉన్నా కేవలం 100 పని దినాలకే పరిమితి చేస్తుండడంతో పనిచేసే వారికి నష్టం కలుగుతుందన్నారు.పనిదినాలపై ఫ్రీజింగ్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. పనికి రాని కూలీలకు అవగాహన కల్పించి ఉపాధి కలిగించాలని అన్నారు. క్షేత్రస్థాయిలో ఉపాధి హామీ సిబ్బందికి ఎలాంటి సమస్యలున్న అంధానకాతగా పరిష్కరించేందుకు కౌన్సిల్ సమావేశంలో చర్చిస్తామని హామీ ఇచ్చారు.



**సమస్యలు పరిష్కరించాలని ఉపాధి హామీ సిబ్బంది వినతి**

ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్ ఫీల్డ్ అసిస్టెంట్లు తమ సమస్యలు పరిష్కరించాలని ఉపాధి హామీ పథకం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దండు రమేష్ కు విజ్ఞప్తి చేశారు. గురువారం కాటారం ఎంపీపీ కార్యాలయంలో రమేష్ ను శాలువాతో సన్మానం చేశారు. క్షేత్రస్థాయిలో పడుతున్న ఇబ్బందులు,సమస్యల పై వినతి పత్రాలు ఇచ్చారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కౌన్సిల్ సభ్యులు దండు రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖాతారం మండలం లో పనిచేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.



## అర్ధరాత్రి రోడ్లపై బైకులతో స్టంట్స్ చేస్తున్న యువకులు

**రాజేంద్రనగర్, మహా :** అరాంఘర్ నుండి బహదూర్ పూరా, ఫ్లైఓవర్పై అర్ధరాత్రి ఆకతాయి యువకులు, బైకులపై స్టంట్స్ చేస్తూ వెళ్తున్నారు. ఇతర వాహనా దారులను ప్రయాణికులను భయభ్రాంతులకు గురిచేస్తు అర్ధరాత్రి రోడ్లపై స్టంట్స్ నిర్వహిస్తూ కేకలు కొడుతూ నానా హంగామా సృష్టిస్తున్నారు. యువకుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. స్టాంట్లు చేసిన యువకుల పై చర్యలు తప్పవని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరికలు.

# రెండు పడక గదుల ఇళ్ల పంపిణీకి వేళాయే..

### కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

**హన్మకొండ, మహా;** హనుమకొండ బాలసముద్రంలోని రెండు పడక గదుల ఇళ్ల పంపిణీ కార్యక్రమానికి ఏర్పాట్లను సిద్ధం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని రెండు పడక గదుల ఇండ్లను జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలసముద్రంలోని రెండు పడక గదుల ఇండ్లను లబ్ధిదారులకు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం పంపిణీ చేయనున్నామని, ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను సంబంధిత శాఖల అధికారులు సిద్ధం చేయాలని అన్నారు. బ్లాక్ ల వారీగా తాగునీరు, విద్యుత్తు, శానిటేషన్ సమస్యలను సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ, మున్సిపల్, ఇతర శాఖల అధికారులు ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కాజీపేట డిప్యూటీ కమిషనర్ రవీందర్, గృహ నిర్మాణ శాఖ పిడి సిద్ధార్థ నాయక్, హనుమకొండ తహసిల్దార్ రవీందర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.





## చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**భూపాలపల్లి, మహా :** చేనేత మరియు జౌళి శాఖ ఆధ్వర్యంలో గురువారం ఐడిఓసి కార్యాలయంలో జిల్లా కేంద్రంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ చేనేత కార్మిక సంఘాల నాయకులు కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

**ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ**

చేనేత పరిశ్రమకు ఎంతో ప్రాధాన్యత ఉందని, ఇది గ్రామీణ ప్రాంతాలలో ఉపాధికి మూలస్తంభంగా నిలుస్తోందన్నారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం వివిధ కార్యక్రమాలు అమలు చేస్తోందని అన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. చేనేత కార్మికులకు రుణమాఫీకి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. స్వాతంత్ర్య సముపార్జనలో చేనేత రంగం ఒక సాధనంగా నిలిచిందని అన్నారు. భారత స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో విదేశీ వస్త్రాలను బహిష్కరించాలన్న లక్ష్యంతో స్వదేశీ ఉద్యమం వచ్చినట్లు పేర్కొన్నారు. 1905వ సంవత్సరం ఆగస్టు 7న స్వదేశీ వస్తువుల బహిష్కరణపై జరిగిన సమావేశంలో విదేశీ వస్త్రాలు బహిష్కరించడంతో పాటు దేశీయ ఉత్పత్తుల వినియోగానికి పిలుపునిచ్చారని, అలా విదేశీ వస్తు బహిష్కరణల కీలకరోజైన ఆగస్టు 7వ తేదీని జాతీయ చేనేత దినోత్సవంగా ఘనంగా జరుపుకుంటున్నామని ఆయన తెలిపారు. జిల్లాలో మగ్గాలపై బట్టలు నేసే కార్మికులు చాలామంది ఉన్నారని, మహదేవ్ పూర్ మండలంలో దసలి పట్టుతో నేసే బట్టలు విదేశాలకు ఎగుమతి చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులు వర్కు షెడ్ ఏర్పాటు చేయాలని చేసిన విజ్ఞాపనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. చేనేత రంగంలో విశిష్ట కృషి చేసిన చేనేత కార్మికులను జిల్లా కలెక్టర్ శాలువాతో ఘనంగా సత్కరించారు. చేనేత దినోత్సవంపై నిర్వహించిన వ్యాసరచన, వకృత్వ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు.





## రోడ్డు ప్రమాదం

### బట్టబయలయిన కిడ్నాప్ యత్నం

**రాజేంద్రనగర్ మహా ;** కిడ్నాప్ చేసి తీసుకెళ్తున్న కారు, రోడ్డు ప్రమాదం జరగడంతో , ఓ మహిళా కిడ్నాప్ కేసు బట్టబయలయింది. శంషాబాద్ ఇన్స్పెక్టర్ నరేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, చేవెళ్ల మండలం అల్లూరు గ్రామానికి చెందిన కోండ్లకల పద్మజ, బుచ్చయ్య దంపతులు, అదే గ్రామానికి చెందిన కమ్మెట విజయ్ గౌడ్ కు నాలుగు లక్షలు అప్పుగా ఇచ్చారు. డబ్బు తిరిగి ఇచ్చే సమయంలో వారి ఇరువురి మధ్య గొడవ జరిగింది. దీంతో విజయ్ గౌడ్ ఆమెపై ద్వేషం పెంచుకున్నాడు. పద్మజా భర్త బుచ్చయ్య వారం నుంచి అస్వస్థకు గురై శంషాబాద్ మండలం మల్కారం గ్రామంలోని ఆశాజ్యోతి మానసిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. 5 తేదీన ఆశాజ్యోతి మానసిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భర్త బుచ్చయ్యను చూడడానికి పద్మజా వెళ్ళింది. కొద్దిసేపు భర్తతో మాట్లాడి పండ్లు తీసుకురావడానికి బయటకి వచ్చింది. అది గమనించిన కమ్మెట విజయ్ గౌడ్, తన స్నేహితులు వెంకటేష్, సాయిలతో, ఎర్టిగా TG07JE8196 వాహనంలో ఆస్పత్రి నుంచి పండ్లు తేవడానికి, బయటకి వెళుతున్న పద్మజాని, బలవంతంగా కారు ఎక్కించి తీసుకెళ్తుండగా, శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని, కొత్వాల్ గుడా సర్వీస్ రోడ్డులో, ముందు నుండి వస్తున్న మరో వాహనాన్ని ఢీ కొట్టింది. పద్మజా తో పాటు ముగ్గురు వ్యక్తులకు తలపై శరీర భాగాల్లో గాయాలయ్యాయి, ఆర్జీఐ పోలీసులు చికిత్స నిమిత్తం, శంషాబాద్ పరిధిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కసి పెంచుకున్న విజయ్ గౌడ్ తన స్నేహితుల తో కలిసి ప్లాన్ ప్రకారమే ఆమెను వెంబడించి కిడ్నాప్ చేశాడు. కారు ప్రమాదంతో కిడ్నాప్ కేసు వెలుగులోకి వచ్చింది. బాధితురాలు ఫిర్యాదు మేరకు, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గ్రేటర్ వరంగల్‌లో ఘనంగా తీజ్ ఉత్సవాలు

### కమిటీ సభ్యులతో కలిసి పోస్టర్ ఆవిష్కరణ

**హన్మకొండ మహా;** గ్రేటర్ వరంగల్ లో ఈనెల 12 నుండి తీజ్ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు మాజీ ఎంపీ అజ్మీర సీతారాం నాయక్ అన్నారు. గురువారం హనుమకొండలోని గిరిజన భవన్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో తీజ్ తేదీల పోస్టర్ను రిటైర్డ్ జెడిఎ జాటోతు ధర్మానాయక్ , నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో పోస్టర్ ను మాజీ ఎంపీ సీతారాం నాయక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ సీతారాం నాయక్ మాట్లాడుతూ.. 12.8.2025 మంగళవారం గోధుమలు నానబెట్టుట 13.8.2025 బుధవారం గోధుమ లను బుట్టలో విత్తడం 14.8.2025 గురువారం బోరడి తీజ్ 15.8.2025 నుండి 16,17,18 వరకూ రోజువారి కార్యక్రమాలు. 19.8.2025 మంగళ వారం ధమోలీ తీజ్ 20.8.2925 బుధవారం రోజున గణ్ గోర్ తీజ్ , 21.8.2025 గురువారం రోజున (కడావ్, సేవాలాల్ మహారాజ్ భోగ్, మేరమ యాడిన బోకడేరో పూజ) తీజ్ పండుగ వేడుకను నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీజ్ పండుగ పురస్కరించుకొని సెలవు దినంగా ప్రకటించాలని, రాష్ట్ర పండుగగా తీజ్ ను గుర్తించడం తో పాటు తమ సంస్కృతి సాంప్రదాయ వేడుకలు గిరిజన భవన్ లో అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని ఈ వేడుకకు రాష్ట్రంలోని అన్ని రంగాల్లో ఉన్న ప్రముఖులను ఆహ్వానిస్తున్నామని , గ్రేటర్ లోని గోర్ బంజారా లందరూ 12వ తేదీ నుండి 21వ తేదీ వరకు ప్రతి రోజు జరిగే ఉత్సవంలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నిర్వహణ కమిటీ సభ్యులు వినోద్ లోక్ నాయక్, గుగులోతు రాజు నాయక్, మాలోతు నాను నాయక్ బాదావత్ బాలాజీ నాయక్, కేలోతు బిక్షపతి, భూక్య రాజు నాయక్, డాక్టర్ మాలోతు చందు నాయక్, భూక్యా సాంబయ్య నాయక్, బోడ నరసింహ నాయక్, ధరావత్ కిషన్ నాయక్, డుంగ్రోత్ కిషోర్ , భూక్య భద్ర, మాలోతు రమేష్ తదితరులు, పాల్గొన్నారు.





## బీజేపీ నాయకుడి మృతి పార్టీకి తీరని లోటు

### బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్

**వరంగల్ మహా;** భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు ఠాకూర్ రవీందర్ సింగ్ అనారోగ్య కారణం వల్ల మృతి చెందిన విషయం తెలుసుకున్న వరంగల్ జిల్లా బిజెపి అధ్యక్షులు గంట రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణా ప్రతాప్ రెడ్డి, తో కలిసి రవీందర్ సింగ్ పార్థివ దేహానికి పూలమాల వేసి, ఆయన మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలియజేసి, ఘన నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

## సమాచార హక్కు చట్టం ప్రధాన కార్యదర్శిగా మల్లం వెంకటేశం

**రంగారెడ్డి జిల్లా మహా:** సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా మల్లం వెంకటేశం నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం ఆ కమిటీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు డాక్టర్.చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి మల్లం వెంకటేశంకు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశం మాట్లాడుతూ... ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి బయటకు తీస్తూ సమాచార హక్కు చట్టం గురించి పౌరులకు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు చింతల రాఘవేందర్ ముదిరాజ్, రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్.దిలీప్ రావ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గోపీనాథ్ కట్టెకోల, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సాహోజు శృతి తదితరులు పాల్గొన్నారు.



## హక్కులను తెలుసుకుని వాటిని వినియోగించుకోవాలి

### జిల్లా సీనియర్ సివిల్ జడ్జి ఏ. నాగరాజ్

**భూపాలపల్లి, మహా :** భారత రాజ్యాంగంలో పొందుపర్చబడిన గిరిజన హోకులు ఏమున్నాయి అనేది తెలుసుకొని వాటిని వినియోగించుకోవాలని న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి,సీనియర్ సివిల్ జడ్జి ఏ. నాగరాజ్ తెలిపారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో గురువారం సమావేశం నిర్వహించారు. గిరిజన హక్కుల పరిరక్షణ, హక్కుల వినియోగం అనే అంశం మీద గౌరవనీయులు జడ్జి ఏ నాగరాజు ప్రసంగించారు. విద్యార్థులు హేతుబద్ధమైన ప్రశ్నలు వేయడం అలవాటు చేసుకోవాలన్నారు. ప్రశ్నించడం మర్చిపోయిన వ్యక్తి తన ఉనికిని కోల్పోతాడని అన్నారు. విద్యార్థులు పోషక ఆహారాన్ని భుజించాలని, ఆరోగ్యంగా వున్నప్పుడే చదువుకోవడం సాధ్యమవుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జిఎస్.ఆర్. దిలీప్ కుమార్ నాయక్, గవర్నమెంట్ ప్లీడర్ బొట్ల సుధాకర్, అడ్వొకేట్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు వి. శ్రీనివాస చారి , ప్రధాన కార్యదర్శి వి. శ్రావణ్ రావు, పాఠశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ సమ్మయ్య నాయక్ , లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్స్ కంప అక్షయ , జి.ప్రియాంక , సీనియర్ న్యాయవాదులు పగడాల ఆనందరావు , మొయినుద్దీన్, సంధ్య పాల్గొన్నారు.





## రెండు పడక గదులను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**వరంగల్ మహా;** వరంగల్ పట్టణంలోని 3వ డివిజన్ పైడిపల్లి లోని రెండు పడక గదుల భవన సముదాయాన్ని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా డబుల్ బెడ్ రూమ్ లలో ఆర్ అండ్ బి శాఖచే చేపడుతున్న మరమ్మతులు, ట్రాన్స్ఫార్మర్స్ ఏర్పాటు, ఎలక్ట్రికల్ పనులను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మరమ్మత్తు పనులు వేగవంతంగా పూర్తి చేసి దివ్యంగ లబ్ధిదారులకు అందించుటకు సిద్ధం చేయాలనీ అన్నారు. బల్దియా ఆధ్వర్యంలో నిర్మించిన అంతర్గత రోడ్డును కలెక్టర్ పరిశీలించి, ప్రాంగణంలో పలు రకాల మొక్కలను నాటి గ్రీనరిని పెంచుటకు బల్దియా ఉద్యానవనాల అధికారికి పలు సూచనలు చేశారు. ఈ ప్రాంత ప్రక్కకు ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురికాకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట జెడ్పి సీఈఓ రామిరెడ్డి, ఎన్పిడిసిల్ ఎస్ఈ గౌతమ్ రెడ్డి, జిల్లా ఆర్ అండ్ బి అధికారి రాజెందర్, హెచ్ఓ లక్ష్మారెడ్డి, తహశీల్దార్ ఇక్బాల్ ఉన్నారు.

## కమ్యూనిజంను తుడిచిపెట్టడం ఎవరి తరం కాదు

- కుత్బుల్లాపూర్ లో సిపిఐ రాష్ట్ర 4వ మహాసభలు
- ఈనెల 19న జరిగే సభలను విజయవంతం చేయాలి
- సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కే రామస్వామి పిలుపు

**చేవెళ్ల, మహా:** భారత కమ్యూనిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర నాలుగవ మహాసభలు ఆగస్టు 19వ తేదీ నుండి 22వ తేదీ వరకు మేడ్చల్ జిల్లా పరిధిలోని కుత్బుల్లాపూర్ లో జరగనున్నాయి. ఈ మహాసభ సందర్భంగా గురువారం చేవెళ్ల మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కే రామస్వామి హాజరై, పార్టీ నాయకులతో కలిసి గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భారత కమ్యూనిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్రలో జరగనున్న నాలుగో మహాసభలను విజయవంతానికి తీసుకెళ్లడానికి, సిపిఐ శ్రేణులు పెద్ద ఎత్తున కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. సిపిఐ పార్టీ రాష్ట్ర మహాసభలలో ప్రజా సమస్యలు రాజకీయ సమస్యలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక విధానాలపై సమగ్రంగా చర్చ చేసి విధివిధానాలను రూపొందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఆపరేషన్ ఖగార్ తో మావోయిస్టులను మొత్తం తుది ముట్టించడానికి కుట్ర చేస్తుందని, 2026 మార్చి నాటికి మావోయిస్టులు లేని భారతదేశాన్ని చూస్తారని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటనలు చేయడం బాధాకరమని ఆయన విమర్శించారు. కమ్యూనిజంని తుడిచిపెట్టడం ఎవరి తరం కాదని అది ఒక సైదాంతిక సిద్ధాంతమని కమ్యూనిజం ప్రజల కష్టాల్లో నుండి పుట్టిందని దాన్ని చంపడం బిజెపి, ఆర్ఎస్ఎస్ వాళ్లకు సాధ్యం కాదని తెలిపారు. ఈ మహాసభకు రంగారెడ్డి జిల్లా నుండి పార్టీ శ్రేణులు కార్యకర్తలు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం ప్రభు లింగం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వడ్ల సత్యనారాయణ, ఇన్సాబ్, జిల్లా అధ్యక్షుడు ఎండి మక్బూల్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఎం సుధాకర్ గౌడ్, గీత, పనివాళ్ల సంఘం మండల కార్యదర్శి కృష్ణ గౌడ్, ఎన్ఎఫ్ఐడబ్ల్యు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల మంజుల తదితరులు పాల్గొన్నారు.



## డీఈఓను సస్పెండ్ చేయాలి

### తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు పీక కిరణ్ డిమాండ్

**కాటారం, మహా :** భూపాలపల్లి జిల్లా మలహర్ మండలంలోని పెద్దతుండ్ల పాఠశాలలోఇంగ్లీష్ టీచర్ పిన్నింటి వేంకటేశ్వర్ రావు ను వెంటనే సస్పెండ్ చేయాలని తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు పీక కిరణ్ డిమాండ్ చేశారు. గురువారం తాడిచర్లలో మీడయాతో మాట్లాడారు. గత మూడేళ్ళుగా పాఠశాలకు రాకుండా ప్రయివేటు వ్యాపారాలు చూసుకుంటూ,ప్రభుత్వ సెలవుల్లో మాత్రమే వేతనం పొందుతున్న అతన్ని వెంటనే విధుల్లో నుంచి తొలగించి,అతనికి కొమ్ము కాస్తున్న జిల్లా డిఈఓను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు పీక కిరణ్,గురువారం ప్రభుత్వానికి, జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా మాట్లాడారు ప్రభుత్వం చేపట్టిన మ్యాచువల్ ట్రాన్స్ పర్ లో భాగంగా 21, జూన్,2022లో జాయిన్ అయిన వేంకటేశ్వర్ రావు 2024 జూన్ 12 వరకు దాదాపు 28 నెలలుగా లాంగ్ లివ్ పెడుతూ,ఆయన స్థానంలో వేరే ఉపాధ్యాయులను జాయిన్ కాకుండా వేకెన్సీ ఇవ్వకుండా చదువుల్లో విద్యార్థులకు నష్టం చేసిన, ఇతగాడి చరిత్రను స్థానిక ప్రధానోపాధ్యాయుడు, ఎంఈఓ లకు జిల్లా డిఈఓ కు పంపిన ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. ఉపాధ్యాయ వృత్తికి మచ్చ తెచ్చే ఇతనివద్ద నుంచి జిల్లా విద్యాధికారి మామూళ్లు తీసికొని చూసిచూడనట్లుగా చేయడం సరికాదన్నారు. అటు ప్రయివేటు వ్యాపారాలు చేసుకుంటూ, ఇటు ప్రభుత్వ ఉద్యోగాన్ని కాపాడుకుంటూ ప్రభుత్వాన్ని మోసం చేస్తూ వస్తున్న ఇతనికి జిల్లా స్థాయి విద్యాశాఖ అధికారులు వతాస్తు పలకడంపై జిల్లా కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.మంత్రి ఇలాకాలో ఇలాంటి ఉపాధ్యాయులు ఉండడం,అదికూడా మూడేళ్ళుగా విద్యాశాఖ నిద్రమత్తులో జోగడం విస్మయానికి గురిచేస్తోందన్నారు.





## విద్యార్థులు వాహనాలు నడపరాదు

- జరగరాని ప్రమాదం జరిగితే విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు బాధ్యత వహించాల్సిందే
- సైబరాబాద్ ట్రాఫిక్ పోలీస్

**రాజేంద్రనగర్, మహా ;** మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, వి ఆర్ సహాయెగ్ చారిటబుల్ ట్రస్ట్, సహకారంతో సొసైటీ సైబర్ సెక్యూరిటీ కౌన్సిల్ సభ్యులు, నీత వడ్గేరే, సైబరాబాద్ ట్రాఫిక్ పోలీస్ ట్రైనింగ్ అధికారులు నవీన్ చారి, మల్లేశ్వర రావు, మస్తాన్ అలీ, నాగేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై, అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. విద్యార్థులు రోడ్డు దాటేటప్పుడు ట్రాఫిక్ నియమాలను, పాటించి ప్రమాదాలను నివారించాలన్నారు. ట్రాఫిక్ నియమ నిబంధనలను వీడియోల ద్వారా విద్యార్థులకు తెరపై చూపించారు. మైనర్ విద్యార్థులు వాహనాలు నడపరాదు, ప్రమాదాలకు విద్యార్థులు గురికావొద్దన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నిరంజన్, సభ్యులు దిలీప్ కాక్కడ్, సుమ, నళిని, పలువురు బిఆర్ఎస్ నాయకులు లక్ష్మణరావు, ఉపాధ్యాయులు రాహుప్, శివరాం, రజిని, స్వాతి, అనుపమ, కవిందర్, విజయ్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ, త్వరగతిన పనులు పూర్తి చేయాలి

### కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

**రాజేంద్రనగర్, మహా :** మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని, పద్మశాలిపురంలో గురువారం జిహెచ్ఎంసి, హెచ్ఎండబ్ల్యూఎస్, ఎస్బి అధికారులతో కలిసి బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి నూతన సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. పద్మశాలి పురంలో సమస్యలపై ఆరాతీశారు. సమస్యలపై స్పందించి వెంటనే తనకు తెలియజేయాలని స్థానిక ప్రజలను కోరారు. డ్రైనేజీ వ్యవస్థను ఒకటి రెండుసార్లు అధికారు లు గమనించాలన్నారు. వర్షాలు నేపథ్యంలో డెంగు, మలేరియా, వ్యాధులు వ్యాపించి ప్రమాదం ఉంది కాబట్టి సంబంధిత అధికారులు డ్రైనేజీ నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. సుమారు పద్మశాలిపురంలో 10 కనెక్టివిటీ తోడు పనులను పరిశీలించారు. అభివృద్ధి పనులలో నాణ్యత పాటించాలి. త్వరగాతినా పనులను పూర్తి చేయాలి. స్థానికులకు సీసీ రోడ్లు అందుబాటులోకి తేవాలన్నారు. కార్యక్రమంలో ఏఈ నరసింహమూర్తి, వర్క్ ఇన్స్పెక్టర్ రాహుల్, నాయకులు బుచ్చిరెడ్డి, అవినాష్, రామకృష్ణ, రాజ్ కుమార్, నరసింహారెడ్డి, మల్లికార్జున్, రాజు, వర్ధన్ రెడ్డి, జగన్, వెంకటేష్, ప్రవీణ్ ,కృష్ణారెడ్డి, శ్రీకాంత్, శంకర్ రెడ్డి, పోలిశెట్టి పుల్లయ్య, ఎస్ఎఫ్ఐ జోష్వా తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధి సంక్షేమ పథకాలు తెలంగాణ రాష్ట్రానికి జోడెద్దుల బండి

### ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్, మహా ;** శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని, మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో, గురువారం, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, చెక్కులను మాజీ జెడ్పిటిసి నిరటి తన్విరాజ్, మాజీ మున్సిపల్ చైర్మన్ సుస్మారెడ్డి, ఎమ్మార్వో రవీందర్ దత్ తో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ 48 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం జీహెచ్ఎంసీ సర్కిల్ 11 పరిధిలో పలు అభివృద్ధి పనులకు గురువారం కార్పొరేటర్ అర్చన జయప్రకాష్ తో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి విషయంలో రాజీ పడే ప్రసక్తి లేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధిలో మిగతా నియోజకవర్గాలతో పోటీపడాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలో ప్రజలు భాగ్యస్వామ్యం కావాలన్నారు. సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికి అందేలా కృషిచేయాలన్నారు. తెలంగాణ ఆడపడుచుల వివాహాలకు రాష్ట్ర ప్రభుత్వం చేయూతనిస్తుందన్నారు. పేదల ఆడపిల్లల వివాహాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఈ పథకంతో మేలు జరుగుతుందన్నారు. మొత్తం రూ 48,05,568/ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ముని, రెవెన్యూ ఇన్స్పెక్టర్ సారిక, మాజీ వైస్ చైర్మన్ గోపాల్ యాదవ్, మండల అధికారులు పంచాయతీ కార్యదర్శులు, సీనియర్ నాయకులు నిరటి రాజు, రవి నాయక్, శేఖర్ రెడ్డి, రాంగోపాల్, దండు ఇష్టారి, మహేందర్ ముదిరాజ్, కోటేశ్వర్ గౌడ్, ప్రభాకర్ యాదవ్, మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, మాజీ సర్పంచ్లు, ఎంపీటీసీలు, వెంకటేష్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, రమేష్ యాదవ్, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## హైదరాబాద్ యూఎస్ కాన్సులేట్‌కు కొత్త కాన్సుల్ జనరల్

**హైదరాబాద్:** నగరంలోని యూఎస్ కాన్సులేట్‌కు కొత్త కాన్సుల్ జనరల్ నియమితులయ్యారు. దశాబ్దాల దౌత్య, సాంకేతిక పరిజ్ఞానాన్ని వెలుగులోకి తెచ్చిన లారా ఇ.విలియమ్స్ నూతన అమెరికా కాన్సుల్ జనరల్ గా అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. యూఎస్ ఫారిన్ సర్వీస్ లో సీనియర్ సభ్యురాలైన విలియమ్స్ గతంలో యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్ లో డిప్యూటీ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ గా పనిచేశారు. హైదరాబాద్ లో సేవలందించడం, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో అమెరికాభారత్ సంబంధాలను బలోపేతం చేయడం గౌరవంగా భావిస్తున్నానని విలియమ్స్ పేర్కొన్నారు. భాగస్వామ్యాలను బలోపేతం చేయడం, సృజనాత్మకతను ప్రోత్సహించడం, ప్రజల మధ్య సంబంధాలను విస్తరించడంపై తన నిబద్ధతను ఆమె తెలిజేశారు. ప్రభావవంతమైన నాయకత్వానికి ప్రశంసలు పొందిన జెన్నిఫర్ లార్సన్ స్థానంలో విలియమ్స్ వచ్చారు. విలియమ్స్ ఐరోపా, ఉత్తర ఆఫ్రికా, లాటిన్ అమెరికాలోని రాయబార కార్యాలయాల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. డిజిటల్ విధానం, విశ్లేషణలు, దౌత్య శిక్షణలో చొరవలకు నాయకత్వం వహించారు. ఇంటర్నేషనల్ రిలేషన్స్ లో బీఏ, టెక్నాలజీ, ప్రాజెక్ట్ మేనేజ్ మెంట్ లో మల్టిపుల్ సర్టిఫికేషన్లు పొందారు.





## పుంజుకున్న స్టాక్ మార్కెట్లు

ఐటీ, ఫార్మా స్టాక్స్ నేతృత్వంలో భారత్ బెంచ్‌మార్క్ సూచీలు సెన్సెక్స్, నిఫ్టీ 50 భారీ రికవరీని సాధించాయి. సెన్సెక్స్ 811.97 పాయింట్లు పుంజుకుని రోజు కనిష్ట స్థాయి (79,811.29) నుంచి 80,623.26 వద్ద (0.10 శాతం లేదా 79.27 పాయింట్లు) ముగిసింది. నిఫ్టీ కూడా 252 పాయింట్లు పుంజుకుని 24,344.15 పాయింట్ల వద్ద (21.95 పాయింట్లు లేదా 0.09 శాతం) 24,596.15 వద్ద ముగిసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత వస్తువులపై అదనంగా 25 శాతం సుంకాన్ని ప్రకటించడంతో సెన్సెక్స్, నిఫ్టీలు పతనమయ్యాయి. గత వారం భారత దిగుమతులపై సంతకం చేసిన 25 శాతం సుంకాలు నేటి నుంచి అమల్లోకి వచ్చాయి. కొత్తగా ప్రకటించిన టారిఫ్ లు 21 రోజుల నోటీసు పీరియడ్ తర్వాత ఆగస్టు 27 నుంచి అమల్లోకి రానున్నాయి. బీఎస్ఈలో టెక్ మహీంద్రా, ఎటర్నల్ (జొమాటో), హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ టాప్ గెయినర్స్‌గా నిలవగా, అదానీ పోర్ట్స్, ట్రెంట్, హిందుస్థాన్ యూనిలీవర్ (హెచ్‌యూఎల్) నష్టపోయాయి. ఎన్ఎస్ఈలో హీరో మోటోకార్ప్, టెక్ మహీంద్రా, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ టాప్ గెయినర్స్‌గా నిలవగా, అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ పోర్ట్స్, గ్రాసిమ్ టాప్ లూజర్స్‌గా నిలిచాయి.

విస్తృత సూచీలు కూడా కోలుకుని పాజిటివ్ గా ముగిశాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ 100 ఇండెక్స్ 0.33 శాతం లాభపడగా, స్మాల్ క్యాప్ 0.17 శాతం లాభపడింది. రంగాలవారీగా చూస్తే నిఫ్టీ ఫార్మా 0.75 శాతం, ఐటీ 0.87 శాతం, మీడియా 0.99 శాతం, ఆటో 0.25 శాతం, పీఎస్ యూ బ్యాంక్ 0.29 శాతం, మెటల్ 0.13 శాతం లాభపడ్డాయి. నిఫ్టీ రియల్టీ 0.13 శాతం, ఆయిల్ అండ్ గ్యాస్ 0.19 శాతం చొప్పున నష్టపోయాయి.

## ఎలక్ట్రిక్ కార్లపై భారీ డిస్కౌంట్స్
## రూ.10 లక్షల తగ్గింపు!

భారతదేశంలో పండుగ సీజన్ మొదలవుతోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని పలు ఎలక్ట్రిక్ వాహన తయారీదారులు.. తమ ఉత్పత్తులపై డిస్కౌంట్స్ లేదా బెనిఫిట్స్ అందించడానికి సిద్ధమయ్యారు. ఈ కథనంలో ఆగస్టు నెలలో ఎలక్ట్రిక్ కార్లపై అందుబాటులో ఉన్న డిస్కౌంట్స్ గురించి తెలుసుకుందాం.

**కియా ఈవీ6**

కియా ఈవీ6 కొనుగోలుపైన ఈ నెలలో కంపెనీ సుమారు రూ.10 లక్షల డిస్కౌంట్ అందిస్తోంది. లేటెస్ట్ డిజైన్, అప్డేటెడ్ ఫీచర్స్ కలిగిన ఈ కారు అత్యుత్తమ పనితీరును అందిస్తుంది. ఇది ఒక ఫుల్ ఛార్జితో 600 కిమీ కంటే ఎక్కువ రేంజ్ అందిస్తుంది. ప్రస్తుతం GTలైన్ AWD వేరియంట్‌లో మాత్రమే ఈ కారు అమ్మకానికి ఉంది.

**మహీంద్రా XUV400**

దేశీయ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా ఈ నెలలో తన XUV400 ఈవీ కొనుగోలుపై రూ. 2.5 లక్షల నుంచి రూ. 3 లక్షల డిస్కౌంట్ అందిస్తుంది. డిస్కౌంట్ అనేది మీరు ఎందుకుని వేరియంట్ మీద ఆధారపడి ఉంటుంది. ఈ కారు 375 కిమీ నుంచి 456 కిమీ రేంజ్ అందిస్తుంది.

**ఎంజీ జెడ్ఎస్ ఈవీ & కామెట్**

ఎంజీ మోటార్ తన జెడ్ఎస్ ఈవీ కొనుగోలుపైన రూ. 2.5 లక్షలు, కామెట్ ఈవీపైన రూ. 60,000 డిస్కౌంట్ అందిస్తోంది. అయితే విండ్సర్ మీద ఎటువంటి తగ్గింపులు లేదు.

**సిట్రోయెన్ ఈసీ3**

సిట్రోయెన్ తన ఈసీ3 కొనుగోలుపైన రూ. 1.25 లక్షల డిస్కౌంట్ అందిస్తుంది. ఈ కారు ఒక సింగిల్ ఛార్జితో 300 కిమీ కంటే ఎక్కువ రేంజ్ అందిస్తుంది.



చూడటానికి SUV మాదిరిగా కనిపించే ఈ హ్యాచ్‌బ్యాక్ 2540 మిమీ వీల్‌బేస్ పొందుతుంది. కాబట్టి ఇది మంచి ప్రయాణ అనుభూతిని అందిస్తుంది.

**ఎలక్ట్రిక్ కార్లు**

టాటా మోటార్స్ తన ఎలక్ట్రిక్ కార్ల మీద రూ. 45000 నుంచి రూ. లక్ష వరకు డిస్కౌంట్ అందిస్తోంది. కంపెనీ టియాగో, పంచ్ , నెక్సాన్ , కర్వ్, హారియర్ ఈవీ వంటివాటి మీద ఈ డిస్కౌంట్ అందిస్తోంది. హారియర్ ఈవీ కొనుగోలుపై లాయల్టీ ప్రయోజనాలు మాత్రమే లభిస్తాయి. టియాగో ఈవీ కొనుగోలుపై గరిష్టంగా లక్ష రూపాయల వరకు తగ్గింపు పొందవచ్చు.

**హ్యుందాయ్ క్రెటా ఎలక్ట్రిక్**

క్రెటా ఎలక్ట్రిక్ కారుపైన హ్యుందాయ్ కంపెనీ రూ. 1 లక్ష వరకు డిస్కౌంట్ అందిస్తోంది. డిస్కౌంట్ ఎంపిక చేసుకునే వేరియంట్ మీద ఆధారపడి ఉంటుంది. 390 కిమీ కంటే ఎక్కువ రేంజ్ అందించే ఈ ఎలక్ట్రిక్ కారు.. మంచి డిజైన్, వాహన వినియోగదారులకు అవసరమైన అన్ని ఫీచర్స్ పొందుతుంది.

## గాజా బాధితులకు ఇండోనేషియా ప్రత్యేక వైద్య సదుపాయం



**జకార్తా:** ఇజ్రాయెల్ సాగిస్తున్న నిరంతర దాడులకు గాజాలో లెక్కలేనంతమంది క్షతగాత్రులుగామారారు. ఈ నేపథ్యంలో గాజాలోని బాధితులను ఆదుకునేందుకు ఇండోనేషియా ముందుకొచ్చింది. తమ దేశానికి చెందిన జనావాసాలు లేని గలాంగ్ ద్వీపంలో గాజా బాధితుల కోసం వైద్య సౌకర్యాలను ఏర్పాటుచేసింది. ఇక్కడ గాజాలో గాయపడిన రెండు వేల మందికి చికిత్స అందించనున్నారు. వారు కోలుకున్న తర్వాత వారిని ఇంటికి తరలించనున్నారని ఇండోనేషియా ప్రతినిధి తెలిపారు. 2023 అక్టోబర్‌లో ఇజ్రాయెల్ దాడుల అనంతరం ఇండోనేషియా.. గాజాకు మానవతా సహాయం పంపింది. ఇప్పుడు యుద్ధంలో బాధితులైన, గాయపడిన సుమారు రెండు వేల ఇండోనేషియా వైద్య సహాయం అందించనుంది. గాయపడిన గాజా ప్రజలకు చికిత్స అందించేందుకు, వారి కుటుంబసభ్యులకు తాత్కాలికంగా ఆశ్రయం కల్పించేందుకు ఇండోనేషియా సుమత్రా ద్వీపంతోపాటు గలాంగ్ ద్వీపంలో వైద్య సదుపపాయాలను ఏర్పాటు చేస్తోంది. గాయపడిన పాలస్తీనియన్లకు ఆశ్రయం కల్పించేందుకు అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో చేసిన ప్రతిపాదనకు ఇండోనేషియా మతాధికారులు తొలుత వ్యతిరేకించినా తరువాత మద్దతు పలికారు.

## వందల కోట్లు పెరిగిన ఐశ్వర్యా రాయ్ సంపద


ఐశ్వర్యారాయ్ బచ్చన్.. సినిమాలు చూసే సామాన్యులకు కూడా ఈ పేరు తెలుసు. ఎంటర్‌టైన్మెంట్ ప్రపంచంలో మంచి పేరున్న తారల్లో ఒకరు. ఏ సినిమాలోనైనా ఆమె కొన్ని క్షణాలు కనిపించినా చాలు అని అభిమానులు ఆశిస్తారు. ఆకట్టుకునే అందం, అద్భుతమైన నటనతో విశేష కీర్తిని సంపాదించడమే కాదు.. చేతినిండా బ్రాండ్ ఎండార్స్‌మెంట్‌లతో బిజినెస్‌లోనూ రాణిస్తూ భారీ సంపదనూ నిర్మించుకున్నారు.

**భారీ నెట్‌వర్త్**

భారత సినీ ప్రపంచంలో టాప్ హీరోయిన్‌గా పేరు తెచ్చుకున్న ఐశ్వర్య రాయ్ బచ్చన్.. సంపదలోనూ అగ్ర స్థానంలో నిలిచారు. సియాసత్ నివేదిక ప్రకారం.. మే 2025 నాటికి ఐశ్వర్య రాయ్ బచ్చన్ రూ .900 కోట్ల నెట్‌వర్త్‌తో భారత దేశంలో రెండవ ధనవంతురాలైన నటి. మిస్ వరల్డ్ కిరీటాన్నిసాధించడమే కాకుండా పవర్‌ఫుల్ పెర్ఫార్మెన్స్‌తో గుర్తింపు తెచ్చుకున్న ఆమె బాలీవుడ్‌లో అత్యధిక పారితోషికం తీసుకునే తారల్లో ఒకరు. న్యూస్ 18 ప్రకారం.. ఆమె ఒక్కో సినిమాకు దాదాపు రూ.10 కోట్ల వరకు పారితోషికం తీసుకుంటుందని సమాచారం. నటనతో పాటు హైఎండ్ ఇండియన్, ఇంటర్నేషనల్ బ్రాండ్లను ప్రమోట్ చేయడం ద్వారా రూ.67 కోట్లు సంపాదిస్తోంది.

**బిజినెస్ వెంచర్లు, విలాసవంతమైన ఆస్తులు**

నటన, బ్రాండ్ ఎండార్స్ మెంట్స్ తో పాటు వ్యాపార ప్రపంచంలోకి కూడా ఐష్ అడుగు పెట్టింది. స్మార్ట్ పెట్టుబడుల కారణంగా ఆమెను బాలీవుడ్ అత్యంత విజయవంతమైన వ్యాపారవేత్తలలో ఒకరిగా పరిగణిస్తున్నారు. పాసిబుల్, యాంబీ వంటి స్టార్టప్‌లలో ఆమె పెట్టుబడులు పెట్టారు. రియల్ ఎస్టేట్ విషయానికొస్తే ఆమెకు పలు విలాసవంతమైన ఆస్తులు ఉన్నాయి. ప్రస్తుతం ఆమె ముంబైలోని బాంద్రాలో రూ.50 కోట్లకు పైగా విలువ చేసే భారీ బంగ్లాలో నివసిస్తున్నారు. దుబాయ్ లోని జుమేరా గోల్ఫ్ ఎస్టేట్స్ లోని ఎత్తైన శాంక్చురీ ఫాల్స్ లో అద్భుతమైన విల్లా ఉంది.





# దేశం-విదేశం

NATIONAL-INTERNATIONAL





## లోయలో పడ్డ సీఆర్‌పీఎఫ్ వాహనం..
## ముగ్గురు జవాన్ల దుర్మరణం

జమ్ము కశ్మీర్ ఉదంపూర్ జిల్లాలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ సిబ్బంది వెళ్తున్న వాహనం అదుపు తప్పి లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో ముగ్గురు జవాన్లు మృతి చెందారు. మరో 15 మంది సిబ్బందికి గాయాలతో చికిత్స పొందుతున్నారు. మొత్తం 23 మంది సీఆర్‌పీఎఫ్ సిబ్బందితో వెళ్తున్న బంకర్ వాహనం బసంత్‌గఢ్ నుంచి గురువారం ఉదయం తిరుగు పయనం అయ్యింది. అయితే.. 10.30గం. ప్రాంతంలో కాంద్వా వద్ద అదుపు తప్పి లోయలోకి దూసుకెళ్లింది. ప్రమాదంలో ఇద్దరు సిబ్బంది మరణించగా.. ఆస్పత్రికి తీసుకెళ్లే క్రమంలో మరొకరు కన్నుమూశారు. క్షతగాత్రులకు స్థానికంగా ఓ ఆస్పత్రిలో చికిత్స అందుతోంది. ఘటన గురించి సమాచారం అందుకున్న పోలీసులు సహాయక చర్యలు ప్రారంభించారు. సదరు వాహనం 187వ బెటాలియన్‌కు చెందిందిగా నిర్ధారించారు. ఘటనపై కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. స్థానిక అధికారులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారాయన.

## ఉపరాష్ట్రపతి ఎన్నికకు ఈసీ నోటిఫికేషన్ జారీ




**న్యూఢిల్లీ:** సెప్టెంబర్ 9న జరగనున్న ఉపరాష్ట్రపతి ఎన్నికకు భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) గురువారం నోటిఫికేషన్ జారీ చేసింది. అధికారికంగా నామినేషన్ ప్రక్రియను ప్రారంభించింది. నోటిఫికేషన్‌లోని వివరాల ప్రకారం నామినేషన్లు దాఖలు చేయడానికి ఆగస్టు 21 చివరి తేదీ.ఈ పత్రాలను ఆగస్టు 22న పరిశీలిస్తారు. నామినేషన్ల ఉపసంహరణకు ఆగస్టు 25 చివరి తేదీ. జగదీప్ ధన్‌ఖడ్ ఆకస్మిక రాజీనామాతో ఎన్నిక తప్పనిసరి అయింది. ధన్‌ఖడ్.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాసిన రాజీనామా లేఖలో క్షీణిస్తున్న ఆరోగ్యం కారణంగా రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. ధన్‌ఖడ్ పదవీకాలం ఆగస్టు 2027లో ముగియనుంది. రాజ్యాంగంలోని నిబంధనల ప్రకారం లోక్‌సభ,రాజ్యసభ సభ్యులతో కూడిన ఎలక్టోరల్ కాలేజీ నిర్వహించే పరోక్ష ఎన్నికల ద్వారా ఉపరాష్ట్రపతిని ఎన్నుకుంటారు. రహస్య బ్యాలెట్ ద్వారా ఓటింగ్ జరుగుతుంది. ఎలక్టోరల్ కాలేజీ సభ్యులు ఏ పార్టీ విప్‌కి కట్టుబడి ఉండనవసరం లేదు. ఉపరాష్ట్రపతిని పార్లమెంటు సభ్యులు ఎన్నుకుంటారు. ఈ కారణంగా ఎన్‌డీఏ తన అభ్యర్థిని సులభంగా ఎన్నుకోగలదు. రెండు సభల ప్రస్తుత బలం 786. అభ్యర్థి గెలవడానికి 394 ఓట్లు అవసరం. ఎన్‌డీఏకు లోక్‌సభలో 293 మంది ఎంపీలు, రాజ్యసభలో 129 మంది ఎంపీలు ఉన్నారు మొత్తం ఓట్ల బలం 422. ఇది ఉపరాష్ట్రపతి ఎన్నికకు అవసరమైన సంఖ్య కంటే అధికం.

## కొనసాగుతున్న ముమ్మర గాలింపు

### ధరాలీలో 28 మందితో కూడిన కేరళ పర్యాటక బృందం జాడ గల్లంతు

### బురదలో కూరుకుపోయిన వారి జాడ కోసం తీవ్రస్థాయిలో అన్వేషణ



**ఉత్తరకాశీ(ఉత్తరాఖండ్):** ఎగువ ప్రాంతాల్లో క్లౌడ్ బరస్ట్(మేఘ విస్ఫోటనం) కారణంగా ఖీర్‌గంగా నదీ ప్రవాహం ఉప్పొంగి దిగువన ధరాలీ గ్రామాన్ని బురద ముంచెత్తడంతో అందులో కూరుకుపోయిన వారి జాడ కోసం యుద్ధప్రాతిపదికన గాలింపు కొనసాగుతోంది. ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీ జిల్లాలోని ధరాలీలో ఇప్పటికే ఐదుగురు సజీవ సమాధికాగా మరొకరి మృతదేహాన్ని బుధవారం వెలికితీశారు. గ్రామంలో చిక్కుకుపోయిన 190 మందిని కాపాడారు. ఇంకా 100 మందికిపైగా జాడ గల్లతైంది. దీంతో ఐటీబీపీ, ఎస్‌డీఆర్‌ఎఫ్, ఆర్మీ, పోలీసు, సహాయక బృందాలు సహాయక, అన్వేషణ చర్యల్లో పూర్తిగా మునిగిపోయాయి. హర్సిల్‌లోని ఆర్మీ క్యాంప్‌కు చెందిన 11 మంది జవాన్ల జాడ ఇంకా తెలియరాలేదు. గంగోత్రి ధామాన్ని దర్శించుకునేందుకు కేరళ నుంచి వచ్చిన 28 మంది యాత్రికుల బృందం జాడ గల్లంతైంది. దీంతో ఆ బృందసభ్యుల బంధువుల్లో ఆందోళనలు రెట్టింపయ్యాయి. ''ఉత్తరకాశీ నుంచి గంగోత్రికి మంగళవారం ఉదయం 8.30 గంటలకు బయల్దేరినట్లు నాతో ఫోన్‌లో చెప్పారు. వాళ్లు ప్రయాణిస్తున్న మార్గంలోనే కొండచరియలు పడ్డాయి. తర్వాత వాళ్లకు ఫోన్ చేస్తే అస్సలు కలవడంలేదు'' అని ఒక బంధువు ఏడుస్తూ చెప్పారు. ''ధరాలీలో మాకు ఇల్లు, హోటల్ ఉన్నాయి. అక్కడే నా సోదరుడు, భార్య, కుమారుడు ఉంటారు. మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఇంతవరకు నా సోదరుడు, అతని కుటుంబం జాడ తెలీడంలేదు'' అని మరో వ్యక్తి వాపోయాడు.

**బురదలో కూరుకుపోయిన ప్రాచీన ఆలయం**

మంగళవారంనాటి బురదచరియలు దూసుకొచ్చిన ఘటనలో ధరాలీ గ్రామంలోని ప్రాచీన కల్ప్ కేదార్ శివాలయాన్ని బురద పూర్తిగా కప్పేసింది. ఈ ఆలయాన్ని సైతం కేదార్‌నాథ్ ఆలయం మాదిరే 'కథూర్' శైలిలో నిర్మించారు. దశాబ్దాల క్రితం జరిగిన ఇలాంటి ఘటనలోనూ కల్ప్‌కేదార్ ఆలయం చాలాభాగం మట్టిలో కూరుకుపోయింది. ఇన్నాళ్లూ శివాలయం పైభాగం మాత్రమే బయటకు కనిపించేది. దీంతో చిన్నపాటి మార్గం గుండా లోపలికి వెళ్లి భక్తులు దర్శనాలు చేసుకునే వాళ్లు. ఆలయ గర్భగుడిలో శివలింగంపై ఖీర్‌గంగా నదీజలం అభిషేకంచేస్తున్నట్లు పడేలా గతంలో ఏర్పాట్లుచేశారు. మంగళవారం నాటి ఉత్పాతంతో పూర్తిగా బురదలో కలిసిపోయింది. ఈ ఆలయాన్ని 1945లో తవ్వకాల్లో గుర్తించారు.

**పలు చోట్ల విరిగిపడిన కొండచరియలు..**

కొండచరియలు పడడంతో గంగోత్రి జాతీయ రహదారిపై పలు చోట్ల రాకపోకలు స్తంభించిపోయాయి. గంగోత్రి జాతీయరహదారి వెంట లిమిఛా నదిపై గంగ్నానీ వద్ద నిర్మించిన వంతెన పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో ఆ వైపు నుంచి వస్తున్న సహాయక బృందాలు ముందుకు కదల్లేక అక్కడే ఆగిపోయాయి. కొండచరియలు పడిన ప్రతిచోటా ఇదే పరిస్థితి. దీనికి తోడు భారీ వర్షాలు సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం కల్గిస్తున్నాయి. వర్షం తగ్గాక ఆకాశమార్గంలో గాలింపు కోసం ఆర్మీ ఎంఐ-17, ఛినూక్ హెలికాప్టర్లను సిద్ధం చేసింది. ''ధరాలీ గ్రామంలో సగభాగం సమాధిలా మారింది. ఇళ్లు, హోటళ్లు, రెస్టారెంట్లు, హోమ్‌స్టేలు, చెట్లు మొత్తం బురదలో కూరుకుపోయాయి. బాధితులకు ఆహారం, ఔషధాలు అందిస్తున్నాం. పునరావాస కార్యక్రమాలను 160 మంది పోలీసులు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు'' అని ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామీ చెప్పారు. బుధవారం ఆయన ఘటనాస్థలిని సందర్శించారు.

## ఎస్ఐ తల నరికి చంపేశారు!



**చెన్నై:** విధి నిర్వహణలో ఉన్న సబ్ ఇన్‌స్పెక్టర్‌ను ఓ ముఠా నరికి చంపేసింది. 100కు వచ్చిన కాల్ మేరకు విచారణకు వెళ్లిన సబ్ ఇన్‌స్పెక్టర్ దారుణ హత్య సమాచారం పోలీసు యంత్రాంగాన్ని కలవరంలో పడేసింది. నిందితుల కోసం ఆరు బృందాలు తీవ్ర వేటలో నిమగ్నమయ్యాయి. బాధిత కుటుంబానికి సీఎం స్టాలిన్ రూ. కోటి ఎక్స్‌గ్రేషియో ప్రకటించారు. వివరాలు.. తిరుప్పూర్ జిల్లా తారాపురం సమీపంలోని అలంగియం పట్టికి చెందిన షణ్ముగ వేల్ కుడిమంగళం పోలీసు స్టేషన్‌లో స్పెషల్ ఎస్ఐగా పనిచేస్తున్నారు. మంగళవారం రాత్రి ఆయన విధులలో ఉండగా 100కు వచ్చిన కాల్‌తో విచారణ నిమిత్తం అదేగ్రామంలోని ఓ ఎస్టేట్ తోటకు వెళ్లారు. విచారణకు వెళ్లిన షణ్ముగ వేల్ దారుణ హత్యకు గురైన సమాచారం బుధవారం ఉదయాన్నే పోలీసు యంత్రాంగాన్ని కలవరంలో పడేసింది. తిరుప్పూర్ జిల్లా పోలీసు ఉన్నతాధికారులు అందరూ రంగంలోకి దిగారు. ఆరు ప్రత్యేక బృందాలను విచారణకు నియమించారు. విచారణలో సంబంధిత ఎస్టేట్ మడత్తుకుళం అన్నాడీఎంకే ఎమ్మెల్యే మహేంద్రన్‌కు చెందినదిగా తేలింది. ఈ ఎస్టేట్‌లో దిండిగల్‌కు చెందిన మూర్తి (65), ఆయన కుమారులు తంగపాండి, మణిగండన్ పనిచేస్తుండడం, వారు అజ్ఞాతంలోకి వెళ్లడంతో అనుమానాలు నెలకొన్నాయి. విచారణలో ఈ తండ్రి కొడుకులు మద్యం మత్తులో తరచూ గొడవ పడుతున్నట్టు, మంగళవారం రాత్రి కూడా ఘర్షణకు దిగినట్టు వెలుగు చూసింది. ఒకర్ని మరొకరు కర్రలతో కొట్టుకుంటుండటంతో 100కు ఫోన్ వెళ్లింది. దీంతో షణ్ముగ వేల్ భద్రత నిమిత్తం అక్కడకు వచ్చి వారిని అడ్డుకున్నట్టు తేలింది. ఈ సమయంలో మణి గండన్ కొడవలితో షణ్ముగ వేల్‌పై దాడి చేసి నరికి పడేశాడు. తప్పించుకునేందుకు షణ్ముగ వేల్ యతిసించినా వదలకుండా హత్యకు పాల్పడ్డాడు. దీనిని షణ్ముగ వేల్‌తో పాటూ వాహనంలో వెళ్లిన డ్రైవర్ గజరాజు చూడడంతో అతడి మీద కూడా దాడికి యతిసించారు. అక్కడి నుంచి తప్పించుకుని పోలీసు స్టేషన్‌లో డ్రైవర్ సమాచారం ఇచ్చాడు. అర్ధరాత్రి వేళ పోలీసులు ఆ ఎస్టేట్‌లోకి పరుగులుతీశారు. షణ్ముగవేల్ మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. నిందితులను పట్టుకునేందుకు ఆరు ప్రత్యేకబృందాలు రంగంలోకి దిగాయి. దర్యాప్తును పోలీసు ఉన్నతాధికారులు వేగవంతం చేయించారు. ఈ సమాచారంతో ఎమ్మెల్యే మహేంద్రన్ ఎస్ఐ కుటుంబాన్ని పరామర్శించి తన సానుభూతి తెలియజేశారు. ఇక సీఎం స్టాలిన్ ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి రూ. కోటి ఎక్స్‌గ్రేషియో ప్రకటించారు. బుధవారం సాయంత్రం పోస్టుమార్టం అనంతరం షణ్ముగ వేల్ మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు. ఆయన భౌతిక కాయం వద్ద డీజీపీ శంకర్‌జివాల్‌తో పాటూ ఉన్నతాధికారులు నివాళులర్పించారు. కాగా, పోలీసులకే రాష్ట్రంలో భద్రత కరువైందంటూ అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళనిస్వామితో పాటూ ప్రతిపక్ష నేతలు దుమ్మెత్తి పోసే పనిలో పడ్డారు.




# ధనుష్‌తో ప్రేమాయణం?

దక్షిణాది అగ్రనటుడు ధనుష్‌తో మృణాల్ ఠాకూర్ ప్రేమలో ఉందనే వార్తలు ప్రస్తుతం ముంబయి సినీ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారాయి. వీరిద్దరి డేటింగ్‌పై ఆంగ్ల మీడియాలో కథనాలొస్తున్నాయి. ఈ జంట ప్రేమబంధానికి కొద్ది మాసాల క్రితమే బీజం పడిందని అంటున్నారు. ఇటీవల జరిగిన 'సన్ ఆఫ్ సర్దార్ 2' ప్రీరిలీజ్ ఈవెంట్‌కు ధనుష్ అతిథిగా హాజరయ్యారు.

ఈ కార్యక్రమంలో ఆయన మృణాల్‌తో చనువుగా ఉన్న వీడియోలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. కొన్ని నెలల క్రితం చెన్నైలో జరిగిన ఓ సినిమా ఈవెంట్‌లో ధనుష్, మృణాల్ మధ్య తొలిసారి పరిచయం ఏర్పడిందని, అక్కడే వీరి ప్రేమప్రయాణానికి తొలి అడుగులు పడ్డాయని అంటున్నారు. ధనుష్ సోదరీమణులు కార్తీక, విమల గీత ఇన్‌స్టాగ్రామ్‌లో మృణాల్ ఠాకూర్‌ను ఫాలో కావడంతో డేటింగ్ వార్తలకు మరింత బలం చేకూరినట్లయింది.

ధనుష్ తన కుటుంబ సభ్యులకు మృణాల్ ఠాకూర్‌ను పరిచయం చేశారని ఆంగ్ల మీడియాలో వార్తలొచ్చాయి. తమ ప్రేమబంధంపై ప్రస్తుతం ఈ జంట గోప్యతను పాటిస్తున్నారని, సరైన సమయంలో అందరికి తెలియపరిచే ఆలోచనలో ఉన్నారని సమాచారం.గత కొద్దిరోజులుగా మీడియాలో వస్తున్న డేటింగ్ వార్తలపై ఈ తారలిద్దరూ ఇప్పటివరకూ స్పందించలేదు. దాంతో డేటింగ్ రూమర్స్ నిజమేనని అభిమానులు భావిస్తున్నారు.




# సౌత్ స్టార్ హీరో నాపై కేకలు వేశాడు: తమన్నా

సినీ ఇండస్ట్రీలో ఇప్పుడు స్టార్ హీరోయిన్లుగా కొనసాగుతున్న చాలామంది కెరీర్ ప్రారంభంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నవాళ్లే. అవమానాలను భరించి, అవకాశం వచ్చినప్పుడు తమ టాలెంట్‌ని నిరూపించుకున్నవాళ్లే ఇప్పుడు స్టార్స్‌గా కొనసాగుతున్నారు. అలాంటి వారిలో తమన్నా కూడా ఒకరు. చిన్న వయసులోనే ఇండస్ట్రీలోకి వచ్చిన ఈ మిల్కీ బ్యూటీ.. కెరీర్ ప్రారంభంలో చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందట. చాలామంది తనను అవమానించి, ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నించారట. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తొలినాళ్లలో తనకు ఎదురైన ఓ సంఘటన గురించి చెప్పింది. తనకు అసౌకర్యంగా ఉందని చెప్పినందుకు ఓ స్టార్ హీరో కేకలు వేసి.. తన స్థానంలో మరో నటిని తీసుకోవాలని ఆదేశించారట.


'చిన్న వయసులోనే ఇండస్ట్రీలోకి వచ్చాను కాబట్టి నాకేమి తెలియదని చాలా మంది అనుకున్నారు. నా ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నించారు. చాలాసార్లు నన్ను అవమానించేందుకు ప్రయత్నంచారు. కెరీర్ ప్రారంభంలో సౌత్‌కి చెందిన ఓ పెద్ద హీరోకి జోడిగా నటించే అవకాశం వచ్చింది. ఆయనతో కొన్ని సీన్లలో నటించాల్సి వచ్చినప్పుడు నాకు కాస్త అసౌకర్యంగా అనిపించింది. ఈ విషయాన్ని దర్శకనిర్మాతలకు చెప్పి.. నాకు ఇబ్బందిగా ఉంది చేయలేనన్నాను. వెంటనే ఆ స్టార్ వచ్చి నాపై కేకలు వేశాను. దర్శకనిర్మాతలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ 'హీరోయిన్‌ని మార్చేయండి' అన్నారు. అప్పుడు నేను కాస్త బాధ పడ్డాను కానీ తిరిగి ఆ హీరోని ఏమి అనలేదు. మౌనంగా ఉండిపోయాను. మరుసటి రోజు ఆ స్టార్ హీరోనే నా దగ్గరకు వచ్చి క్షమాపణలు చెప్పాడు. కోపంలో అలా అరిచానని, అలా ప్రవర్తించి ఉండకూడదని పశ్చాత్తాపపడ్డాడు' అని తమన్నా చెప్పుకొచ్చింది. అయితే ఆ హీరో పేరు చెప్పడానికి మాత్రం నిరాకరించింది.

తమన్నా సినీ కెరీర్ విషయానికొస్తే.. 2005లో 'చాంద్ సా రోష్ చెహ్రా' మూవీతో బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత మంచు మనోజ్ శ్రీ సినిమాతో టాలీవుడ్‌లోకి అడుగుపెట్టింది. హ్యాపీడేస్‌తో మంచి గుర్తింపు సంపాదించుకుంది. ఆ తర్వాత టాలీవుడ్‌లో వరుస అవకాశాలు వచ్చాయి. చిరంజీవి, వెంకటేశ్ లాంటి సీనియర్ హీరోలతో పాటు మహేశ్ బాబు, ఎన్టీఆర్, ప్రభాస్, అల్లు అర్జున్, రామ్ చరణ్ లాంటి స్టార్ హీరోలతోనూ సినిమాలు చేసింది. ఆ మధ్య ఓదెల 2 మూవీతో తెలుగు ప్రేక్షకులను పలకరించారు. ప్రస్తుతం నాలుగు హిందీ సినిమాల్లో నటిస్తున్నారు.

# జూ.ఎన్టీయార్... నా ప్రచార యుద్ధం నాదే



హీరోలు హీరోయిన్లు సినిమా ప్రచారంలో పాల్గొంటారే తప్ప ప్రచార బాధ్యతల్ని స్వయంగా చేపట్టడం అనేది జరగదు. సాధారణంగా ఆ బాధ్యతను కూడా సినిమా నిర్మాతలు, నిర్మాణ సంస్థలే చూసుకుంటాయి. అయితే గత కొంత కాలంగా జూనియర్ ఎన్టీయార్ దీనికి కొంత విభిన్నంగా ప్రయాణిస్తున్నారు. సినిమా నిర్మాణ సంస్థల ప్రచారపు తీరుతెన్నులు ఎలా ఉన్నప్పటికీ... తాను కూడా వ్యక్తిగతంగా మరోవైపు నుంచి వీటిని నిర్వహిస్తున్నట్టు సమాచారం. గతంలో రాజమౌళి రూపొందించిన ఆర్ఆర్ఆర్ సినిమా ప్రమోషన్ సమయంలో కూడా ఆయన ఇదే పంథాను అనుసరించారు. వ్యక్తిగతంగా అనేక వ్యయ ప్రయాసలకు ఓర్చుకుని అంతర్జాతీయ స్థాయి లో ప్రచార వ్యూహాలు అమలు చేశారట. ఆ సినిమా మల్టీ స్టారర్ అయినప్పటికీ జూ.ఎన్టీయార్(Jr NTR) కు వచ్చిన గుర్తింపు మరెవరికీ రాకపోవడానికి అదే కారణం అంటున్నారు. పలువురు హాలీవుడ్ దర్శకులు సైతం జూ.ఎన్టీయార్‌తో సినిమా చేయడానికి రెడీ అంటూ ప్రకటనలు గుప్పించిన సంగతి తెలిసిందే. తాజాగా వార్ 2 సినిమా విషయంలోనూ ఆయన ఇదే తరహా నిర్ణయం తీసుకున్నారని తెలుస్తోంది. బాలీవుడ్ హీరో హృతిక్ రోషన్‌తో తొలిసారి స్క్రీన్ షేర్ చేసుకుంటున్న టాలీవుడ్ యంగ్ టైగర్... వార్ 2 ని రూపొందించిన యష్ రాజ్ ఫిలింస్ ప్రచార శైలి పట్ల కినుక వహించారో, లేక తను కూడా మరింత బలం చేకూర్చాలనుకున్నారో తెలీదు గానీ ఈ సినిమా ప్రచారం విషయంలో ఎన్టీయార్ తన పిఆర్ టీమ్‌ను అలర్ట్ చేశారట. మరోవైపు తాజాగా సయ్యారా సినిమా సంచలన విజయం సాధించిన తర్వాత, ఆ సినిమాను కూడా సమర్పించిన యశ్ రాజ్ ఫిలింస్ భవిష్యత్తు ప్రమోషన్ వ్యూహంలో కీలక మార్పులు చేశారని తెలుస్తోంది. సయ్యారా సినిమా మార్కెటింగ్‌ను ఈ సంస్థ అత్యంత వినూత్నంగా నిర్వహించింది. ప్రధాన జంట ప్రమోషన్ కోసం చాట్ షోలు షాపింగ్ మాల్స్‌లో డ్యాన్స్ ప్రోగ్రామ్స్ వంటివి చేయడానికి బదులుగా, సినిమా పాటలు విజువల్ ప్రమోషన్ల ద్వారా మాత్రమే సినిమాపై ఆసక్తిని పెంచడం అనే కొత్త వ్యూహాన్ని ఈ సినిమా కోసం అవలంబించి విజయం సాధించారు. ఈ పరిణామాల నేపథ్యంలో వార్ 2 ప్రచార సరళిలో కూడా ఈ సంస్థ కీలక మార్పు చేర్పులు చేసినట్టు సమాచారం. అయితే ఈ మార్పు చేర్పుల పట్ల అంతగా సంతృప్తి చెందని జూనియర్ ఎన్టీఆర్ తన చిత్రం ప్రమోషన్ బాధ్యతలను తానే స్వయంగా చేపట్టారట. యశ్ రాజ్ ఫిలింస్ వారి మార్కెటింగ్ వ్యూహాన్ని వారు అనుసరిస్తున్నారని భావించిన ఎన్టీఆర్, తన వ్యక్తిగత మీడియా వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. మరీ ముఖ్యంగా మరో టాప్ హీరోతో కలిసి చేసే మల్టీ స్టారర్స్ విషయంలో జూ.ఎన్టీయర్ మరింత జాగ్రత్త పడుతున్నట్టుగా కనిపిస్తోంది. ప్రతిష్టాత్మకంగా రూపొందిన వార్ 2 సినిమా ఆగస్టు 14న విడుదలకు సిద్ధమవుతోంది. ఇందులో హృతిక్ రోషన్, జూనియర్ ఎన్టీఆర్ లాంటి స్టార్ హీరోలు నటించడంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. అధికారిక ప్రమోషన్ కార్యక్రమాల్లో స్టార్స్ కనిపించకపోవచ్చుననే అంచనాలతో, అభిమానులు సోషల్ మీడియా ఇతర మార్గాల ద్వారా ఈ సినిమా ప్రచారాన్ని ఆసక్తిగా గమనిస్తున్నారు.



# 400 కోట్ల బంగారం కొనుగోలు..


## లిక్కర్ నిందితుడితో తమన్నా ఎక్కడికి వెళ్లింది? మిల్కి బ్యూటీ మౌనంపై అనుమానాలు

ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం రేపుతున్న 3500 కోట్ల రూపాయల లిక్కర్ స్కామ్‌లో సినీ నటి తమన్నా భాటియాకు లింక్ ఉన్న దిగ్భ్రాంతికరమైన విషయాలు బయటకు వస్తున్నాయి. ఈ భారీ కుంభకోణంలో అరెస్ట్ అయిన A34 వెంకటేష్ నాయుడితో కలిసి ఎర్రబుగ్గ కారు, స్పెషల్ ఫ్లయిట్‌లో ప్రయాణించినట్టు సోషల్ మీడియాలో వెలుగు చూసిన తమన్నా ఫోటోలు రాజకీయ, సినీ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి. ఈ వ్యవహారంలో తమన్నా మౌనం వహించడంపై ప్రముఖ టెలివిజన్ ఛానెల్‌తో పాటు పలువురు నెటిజన్లు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. ఈ కుంభకోణం, లిక్కర్ మాఫియా వివాదంలో తమన్నా గోల్డ్, జ్యువెల్లరీ బిజినెస్ విషయం కేంద్ర బిందువుగా మారబోతుందా? ఆమెను సిట్ అధికారులు విచారణ కోసం పిలుస్తారా? అనే విషయం ఆసక్తికరమై చర్చకు దారి తీస్తున్నది. ఈ వివాదానికి సంబంధించిన వివరాల్లోకి వెళితే..

ఆంధ్రప్రదేశ్‌లో మద్యం కుంభకోణం రాజకీయ వర్గాల్లో ప్రకంపనాలు సృష్టిస్తున్నది. ఈ స్కామ్ పాలిటిక్స్‌కే కాకుండా సినీ పరిశ్రమకు కూడా తాకడంతో ఈ వ్యవహరం మరింత హైలెట్ అవుతున్నది. అయితే కేవలం 5 లక్షల రూపాయల ఆదాయం ఉన్న వెంకటేష్ నాయుడితో తమన్నాకు ఉన్న సంబంధాలు ఏమిటి? ఆమెతో ఆయనకు ఉన్న లావాదేవీలు ఏమిటి? అతడితో కలిసి ఎక్కడికి వెళ్లింది? ఓ సాధారణ వ్యక్తితో కలిసి అంత సన్నిహితంగా కలిసి ప్రయాణం చేసే అవకాశం ఉందా? అనే ప్రశ్నలను మీడియా, నెటిజన్లు సంధిస్తున్నారు.

అయితే మీడియా కథనాల్లో కొత్తగా బయటకు వచ్చిన విషయం ఏమిటంటే? తమన్నాకు గోల్డ్, జ్యువెల్లరి బిజినెస్ ఉంది. అయితే లిక్కర్ స్కామ్‌లో సుమారుగా 400 కోట్ల రూపాయల విలువైన బంగారాన్ని కొనుగోలు చేశారు. అయితే ఆ బంగారాన్ని తమన్నా సంస్థలోనే కొన్నారా? అందుకే వారిద్దరూ కలిసి స్పెషల్ జెట్‌లో ప్రయాణించారా? స్పెషల్ జెట్ ఫ్లయిట్‌లో బంగారం తీసుకెళ్లారా? లేదా భారీగా నగదు ట్రాన్స్‌పోర్టు చేశారా? అనే అనుమానాలు బలపడుతున్నాయి అని మహా న్యూస్ తన ప్రత్యేక కథనంలో సందేహాలు వ్యక్తం చేయడం మీడియాలో సంచలనం రేపింది. అయితే వెంకటేష్ నాయుడు టాంజానియాలో గోల్డ్ మైనింగ్‌ను ప్రారంభించాలని అనుకొన్నాడు. ఆ పనులు, ప్రారంభం వ్యవహారాల్లో తమన్నాకు ఏమైనా లింకు ఉందా? వారిద్దరూ విదేశాలకు వెళ్లారా? రాజకీయ నేతలు, బిజినెస్ వర్గాలతో జరిగిన పార్టీ కోసం డ్రెస్ కోడ్ పాటించారా? అనే అనుమానాల్ని మీడియా వ్యక్తం చేస్తున్నది. అయితే తన కంపెనీలో బంగారం కొనుగోలు చేస్తే తమన్నా మౌనం ఎందుకు పాటిస్తున్నది? వెంకటేష్ నాయుడితో తనకు ఉన్న రిలేషన్ గురించి మిల్కీ బ్యూటీ సైలెంట్‌గా ఎందుకు ఉంటున్నారు? అనే విషయంపై రకరకాల ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. కన్నడ రంగంలో వెంకటేష్ నాయుడు సినిమాల నిర్మాణం చేపట్టాలనే ఆలోచనతో ఉన్నాడు అనే విషయం కొత్తగా వెలుగు చూసింది. తమన్నాతో కలిసి ఏదైనా సినిమాలు తీయాలనుకొన్నారా? అయితే సినిమాలే తీయడానికి కలిస్తే.. ఎర్రబుగ్గ కారును ఎందుకు ఉపయోగించారు? ఆ కారు ఎవరిది? ప్రోటోకాల్ వాహనాన్ని ఎవరు పంపించారు? తమన్నాతో కలిసి బెంగళూరుకు వెళ్లారా? ఇంకా ఎక్కడికైనా వెళ్లారా? అనే అనుమానాల్ని మీడియాతో సోషల్ మీడియాలో పలువురు వ్యక్తం చేస్తున్నారు.

# స్టార్ హీరో కొడుకుతో మణిరత్నం లవ్‌స్టోరీ?



జయాపజయాలు అనేవి ఎవరి చేతుల్లోనూ ఉండవు. ఇంకా చెప్పాలంటే అపజయాలను ఎదుర్కోని మనిషే ఉండడు. సినిమా రంగం ఇందుకు అతీతం కాదు. ముఖ్యంగా మణిరత్నంకు ఇండియన్ ఏస్ డైరెక్టర్ అనే పేరు ఉంది. ఆయన దర్శకత్వం వహించిన చిత్రాలు అలాంటివి. ఓ నాయకన్, ఒక దళపతి ,ఒక ముంబాయి ఇలా చెప్పుకుంటూ పోతే మణిరత్నం దర్శకత్వం వహించిన ఆణిముత్యాల్లాంటి చిత్రాలు చాలానే ఉన్నాయి. ఇటీవల కూడా పొన్నియన్ సెల్వన్ అంటే చారిత్రిక కథా చిత్రాన్ని ఆయన అద్భుతంగా సెల్యులాయిడ్‌పై ఆవిష్కరించారు. అలాంటి దర్శకుడు తాజాగా దర్శకత్వం వహించిన థగ్‌లైఫ్ చిత్రం నిరాశపరిచింది. దీంతో ఆయనపై విమర్శల దాడే జరిగింది. అలాగని మణిరత్నం కృంగిపోలేదు. అలాగైతే ఆయన అన్ని సూపర్ హిట్ చిత్రాలను అందించే వారే కాదు. తాజాగా మరో యూత్ ఫుల్ లవ్‌స్టోరీతో రావడానికి సిద్ధమవుతున్నారన్నది కోలీవుడ్ వర్గాల సమాచారం. అందుకు ఆయన యువ నటుడు, స్టార్ హీరో విక్రమ్ కొడుకు ధ్రువ్ విక్రమ్‌ను కథానాయకుడిగా ఎంచుకున్నట్లు, కథానాయిక రుక్మిణి వసంత్‌ను ఎంపిక చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ధ్రువ్ విక్రమ్ మంచి బ్రేక్ కోసం ఎదురుచూస్తున్నారు. కాగా ప్రస్తుతం ఈయన మారిసెల్వరాజ్ దర్శకత్వంలో బైసన్ అనే చిత్రంలో నటిస్తున్నారు. క్రీడా నేపథ్యంగా రూపొందుతున్న బైసన్ చిత్రంపై మంచి అంచనాలే నెలకొన్నాయి. కాగా తదుపరి ధ్రువ్‌విక్రమ్ మణిరత్నం దర్శకత్వంలో నటించడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. రుక్మిణి వసంత్ జంటగా నటించడానికి రెడీ అవుతున్నట్లు తెలిసింది. ఈ యూత్ ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్ చిత్రాన్ని సెప్టెంబర్‌లో సెట్ పైకి తీసుకెళ్లడానికి సన్నాహాలు జరుగుతున్నట్లు సమాచారం. దీనికి సంబంధించి అధికారికంగా త్వరలో వెలుపడే అవకాశం ఉంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com